PRGI RNI : TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు

vaarthasadhya@gmail.com

epaper.vaarthasadhya.com

విలేకరులు కావలెను!

మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
హైదరాబాద్ & అమరావతి
మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.

CM NEWS For The People

విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు జిల్లా స్థాయి విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి

7396122101 vaarthasadhya@gmail.com

9951751662 epaper.vaarthasadhya.com

Published From : Rangareddy VOLUME : 01 Issue : 255 Saturday 5-09-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet



## సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

భారత్ సైనిక విన్యాసాలకు సిద్ధమవుతుండటంతో పాకిస్థాన్‌లో కలకలం మొదలైంది. రాజస్థాన్‌లో సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు 17 రోజుల పాటు విన్యాసాలు నిర్వహించేందుకు నోటమ్ జారీ అయింది. దీంతో పాక్ రక్షణ అధికారులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సరిహద్దుల్లో నిఘా పెంచాలని ఆదేశించినట్లు సమాచారం.

02

- భారత్--పాక్ సరిహద్దులో 17 ని రోజులపాటు భారీ డ్రిల్స్
- సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
- ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
- భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
- సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
- విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
- భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
- ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు



02

## కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

- ఉగ్రవాది హతం
- బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
- సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
- కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
- ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
- మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
- హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది

# నాణ్యతలో రాజీ వద్దు

## అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

- నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో సీఎం పర్యటన
- మద్దూరులో పలు అభివృద్ధి పనుల పరిశీలన
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులు మార్చిలోగా పూర్తి చేయాలి
- గురుకుల పాఠశాల పనుల్లో జాప్యం చేయొద్దు
- నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి
- లోపాలుంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరిక
- పనులు వేగంగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

/నారాయణపేట ప్రతినిధి/మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో లోపాలు తలెత్తితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం మద్దూరులో పలు అభివృద్ధి పనులను సీఎం పరిశీలించారు. మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పూలగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు.

-మిగతా 2 లో





## రేపు బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం

- ఎర్రవెల్లిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి భేటీ
- కేసీఆర్ అధ్యక్షతన సమావేశం
- అసెంబ్లీ, మండలి వ్యూహంపై చర్చ
- కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై చర్చ
- హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమీక్ష
- కృష్ణా, గోదావరి జలాల అంశంపై చర్చ
- ఏపీ జలదోపిడీపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్

సోమవారం నుంచి అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం ఆదివారం నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధినేత కె చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం అనంతరం రెండు గంటలకు పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులతో కూడిన సంయుక్త

-మిగతా 2 లో

## ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు



02

## ఎల్‌నినో ఉగ్రరూపం..




02

- వచ్చే ఏడాది వాతావరణం భయానకం
- 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
- ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
- 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
- పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
- కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
- పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
- 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
- వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు

## ఇస్రో జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్



02

- నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
- 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
- రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
- సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
- అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
- స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
- భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
- వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



02

## నేడే భారత్ పాక్ పోరు

మహిళల ఆసియాకప్ సమరం
రాత్రి 8గం నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

- దుబాయ్‌లో చిరకాల ప్రత్యర్థుల సమరం
- వరుస విజయాలతో సెమీస్‌కు చేరిన భారత్
- హ్యాట్రిక్ విజయంపై హర్మన్‌ప్రీత్ సేన కన్ను
- థాయ్‌లాండ్, హాంకాంగ్‌పై ఘన విజయాలు
- హాంకాంగ్‌పై స్మృతి మంధాన విధ్వంసక సెంచరీ
- 124 పరుగులతో చెలరేగిన మంధాన
- గ్రూప్ టాపర్‌గా నిలవాలని టీమిండియా పట్టుదల



## నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

- అంబేద్కర్ స్టేడియంలో జెన్‌జీ సభ
- ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ
- విద్యార్థులు, యువత భారీగా హాజరయ్యే అవకాశం
- సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన గంగుల కమలాకర్
- యువత, విద్యార్థి సంఘాల నేతలతో సమీక్ష
- ఉదయం 10.15 గంటలకు సభకు చేరుకోనున్న కేటీఆర్
- సభకు జన సమీకరణపై బీఆర్ఎస్ నేతల దృష్టి

కరీంనగర్,

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శనివారం కరీంనగర్ వస్తున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. అంబేద్కర్ మినీస్టేడియంలో విద్యార్థులు, యువత ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నిర్వహించే జెన్‌జీ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పర్యవేక్షించారు. యువత, విద్యార్థి సంఘాల

-మిగతా 2 లో

# సురేఖను తప్పించడం బాధాకరం



## క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ

- పార్టీలోనే కొనసాగాలని సురేఖను కోరుతున్నాం
- బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని తప్పిదం
- సురేఖ కుమార్తె వ్యాఖ్యలపై అధిష్ఠానం ఆగ్రహం
- పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకే కఠిన నిర్ణయం
- సీఎం రేవంత్‌కు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదు
- పార్టీకి నష్టం కలిగించే వారిని హైకమాండ్ ఉపేక్షించదు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్

హైదరాబాద్,

: మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పించడం బాధాకరమైన విషయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సురేఖ బర్తరఫ్ అంశంపై శుక్రవారం ఆయన స్పందించారు. పార్టీలో ఎవరైనా క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం నుంచి కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. నాయకులకు తమ అభిప్రాయాలు, సమస్యలను చెప్పుకొనేందుకు పార్టీలో అంతర్గతంగా ఎన్నో వేదికలు ఉన్నాయని, వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటం క్షమించరాని

-మిగతా 2 లో

# ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం సక్సెస్


ం నింగిలోకి దూసుకెళ్లిన నాటీ బాయ్..
ం 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం కక్ష్యలోకి
ం రక్షణ, వ్యవసాయం, విపత్తుల నిర్వహణకు కీలకం
ం సబ్-జీటీఓలోకి కచ్చితత్వంతో ఉపగ్రహ ప్రవేశం
ం అత్యాధునిక ఇమేజింగ్ సామర్థ్యాలతో ఈఓఎస్-05
ం స్వదేశీ క్రయోజెనిక్ ఇంజిన్ కీలక పాత్ర
ం భూ పరిశీలన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయనున్న ఉపగ్రహం
ం వర్షంలోనూ ప్రయోగాన్ని వీక్షించిన 1,500 మంది సందర్శకులు



శ్రీహరికోట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతమైంది. రెండో ప్రయోగ వేదిక నుంచి తెల్లవారుజామున 2.55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్17.. ప్రయోగం జరిగిన సుమారు 18 నిమిషాల తర్వాత 3.13 గంటలకు 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్-జీటీఓ)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. పెరీజీ 170 కిలోమీటర్లు, అపోజీ 28,934 కిలోమీటర్లుగా ఉన్న ఈ కక్ష్యలోకి ఉపగ్రహాన్ని కచ్చితత్వంతో చేర్చడంలో ఇస్రో శాస్త్రవేత్తలు సఫలమయ్యారు. సుమారు 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా చేపట్టిన జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం. ప్రస్తుతం ఈఓఎస్-05ను సబ్-జీటీఓ నుంచి తుది జియోస్టేషనరీ కక్ష్యలోకి చేర్చే ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఉపగ్రహంలోని ఆన్‌బోర్డ్ ప్రొపల్షన్ వ్యవస్థను వినియోగించనున్నారు. ఈఓఎస్-05 అత్యాధునిక భూ పరిశీలన సామర్థ్యాలతో రూపొందించిన ఉపగ్రహం. ఇందులో అమర్చిన ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూ పరిశీలనకు ఉపయోగపడనుంది. విస్తృత ప్రాంతాలను స్పష్టంగా చిత్రీకరించడంతో పాటు తక్కువ వ్యవధిలోనే చిత్రాలను అందించే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. జియోసింక్రోనస్ కక్ష్యలో ఉండే ఈఓఎస్-05 భారత ఉపఖండాన్ని తరచుగా పర్యవేక్షించేందుకు దోహదపడనుంది. ఈ ఉపగ్రహం నుంచి లభించే చిత్రాలు రక్షణ రంగానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షించడం, కీలక ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను గుర్తించడం వంటి అవసరాలకు ఈ డేటాను వినియోగించవచ్చు. వరదలు, తుపాన్లు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించేందుకు కూడా ఉపగ్రహ సమాచారం ఉపయోగపడనుంది. సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, అత్యవసర ప్రణాళికలను మరింత సమర్థంగా రూపొందించేందుకు ఇది దోహదం చేయనుంది. వ్యవసాయ రంగంలోనూ ఈఓఎస్-05 కీలకంగా మారనుంది. పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, భూమిలో తేమ, నీటి వనరుల స్థితి వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ఉపగ్రహ డేటాను వినియోగించవచ్చు. వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల అంచనాల్లో ఇది ఉపయోగపడనుంది. అలాగే అడవుల విస్తీర్ణంలో మార్పులు, పట్టణ ప్రాంతాల విస్తరణ, భూ వినియోగంలో మార్పులు, సహజ వనరుల పరిస్థితిని దీర్ఘకాలంగా పర్యవేక్షించేందుకు కూడా ఈ ఉపగ్రహం దోహదపడనుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 మూడు దశల ప్రయోగ వాహకనౌక. ఇందులో అత్యంత క్లిష్టమైన స్వదేశీ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ ప్రయోగ విజయానికి కీలకంగా నిలిచింది. ఈ దశ సమర్థంగా పనిచేయడంతో ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం సాధ్యమైంది. స్వదేశీ క్రయోజెనిక్ సాంకేతికతపై ఇస్రో సాధించిన పట్టు మరోసారి నిరూపితమైంది. జీఎస్ఎల్వీ రాకెట్ గతంలో కొన్ని అనూహ్య ఫలితాలను ఎదుర్కొన్న నేపథ్యంలో దీనికి 'నాటీ బాయ్' అనే మారుపేరు వచ్చింది. 2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం నిర్దేశిత కక్ష్యను చేరుకోలేకపోయింది. అయితే ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో.. సాంకేతికంగా మరింత మెరుగైన వ్యవస్థలతో చేపట్టిన తాజా ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. భారీ ఉపగ్రహాలను అధిక కక్ష్యల్లోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. తెల్లవారుజామున 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు వెనక్కి తగ్గలేదు. వర్షంలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన అద్భుత ఘట్టాన్ని వీక్షించారు. ఈఓఎస్-05 ప్రయోగం భారత భూ పరిశీలన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు రక్షణ, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, అటవీ, పర్యావరణ పర్యవేక్షణ వంటి అనేక రంగాలకు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించనుంది. స్వదేశీ రాకెట్లు, క్రయోజెనిక్ సాంకేతికత, అధునాతన ఉపగ్రహ వ్యవస్థలతో అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతికి జీఎస్ఎల్వీ-ఎఫ్17 విజయం మరో నిదర్శనంగా నిలిచింది.

# కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

-ఉగ్రవాది హతం
-బుద్గామ్‌లో భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
-అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
-ఓ ఉగ్రవాది హతం.. ఏకే రైఫిల్ స్వాధీనం
-సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త గాలింపు
-కచ్చితమైన నిఘా సమాచారంతో ఆపరేషన్
-ఘటనాస్థలంలో ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం
-మరో ఉగ్రవాది కోసం కొనసాగుతున్న గాలింపు
-హతమైన ఉగ్రవాది వివరాలు తెలియాల్సి ఉంది



లిశ్రీనగర్:
జమ్మూకాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. అఫ్తార్ గలీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో భారత సైన్యం, జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలకు అనుమానాస్పద కదలికలు కనిపించడంతో అక్కడ ఉన్నవారిని అప్రమత్తం చేశారు. దీంతో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగా, భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఘటనాస్థలంలో ఒక ఏకే రైఫిల్‌తో పాటు ఇతర యుద్ధ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, హతమైన ఉగ్రవాది వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇదే ప్రాంతంలో మరో ఉగ్రవాది దాక్కుని ఉండొచ్చన్న అనుమానంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. కాశ్మీర్ లోయలో గత కొన్ని నెలలుగా ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.


# నేడే భారత్-పాక్ పోరు



దుబాయ్:
మహిళల ఆసియాకప్-2026లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. నేడు దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్-పాకిస్తాన్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. గ్రూప్-ఎలో ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో సెమీస్ బెర్తు ఖరారు చేసుకున్న టీమిండియా.. నేటి మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను కూడా మట్టికరిపించి హ్యాట్రిక్‌తో పాయింట్స్ టేబుల్ టాపర్‌గా గ్రూప్ దశను ముగించాలని పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 94 పరుగుల తేడాతో చిత్తు చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. రెండో మ్యాచ్‌లో హాంకాంగ్‌పై 137 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన 64 బంతుల్లోనే 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో ఏకంగా 124 పరుగులు చేసి విధ్వంసకర సెంచరీతో టీమిండియాకు అదిరే విజయాన్ని అందించింది. ఇక తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో పాక్‌పై కూడా అదే జోరు కొనసాగించాలని పట్టుదలతో ఉంది.

# రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

మొదటి తరువాయి



సమావేశం జరగనుందని ఆ పార్టీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచించారని పేర్కొంది. తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన, ఇచ్చిన హామీల అమలు, వైఫల్యాలు, 22ఏ పరిధిలోని నిషేధిత భూములు, 97 జీవో వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల ఆందోళన, కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఏపీ జలదోపిడీ వంటి అంశాలపై చర్చించనున్నారు. అసెంబ్లీ, శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహం, లేవనెత్తిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

# ఇటలీకి సుదీర్ఘకాల ప్రధానిగా మెలోనీ రికార్డు

-1,413 రోజుల పదవీకాలంతో మెలోనీ రికార్డు
-రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక కాలం ప్రధాని
-మెలోనీకి అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ
-మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఇటలీ ప్రధాని
-భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఇరువురి ప్రశంసలు
-రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం
-మోదీ-మెలోనీ స్నేహం 'మెలోడీ'గా సోషల్ మీడియాలో ఫేమస్
-భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ కారిడార్‌పై కలిసి పనిచేయనున్న ఇరుదేశాలు



న్యూఢిల్లీ / రోమ్:
ఇటలీకి అత్యధిక కాలంగా పనిచేస్తున్న ప్రధానిగా జార్జియా మెలోనీ రికార్డు సృష్టించారు. మెలోనీ అక్టోబరు 22, 2022 నుంచి ఇటలీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారు. గురువారం 1,413 రోజుల నిరంతర పదవీకాలం పూర్తయిన తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశంలో అత్యధికకాలం నిరంతరం పనిచేసిన ప్రధానమంత్రిగా ఆమెనిలిచారు. గత రికార్డు సిల్వియో బెర్లుస్కోని పేరిట ఉండేది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మెలోనీని అభినందిస్తూ, ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకం, విశ్వాసం ఈ మైలురాయిలో ప్రతిబింబిస్తోందని చెప్పారు. నా స్నేహితురాలు ప్రధానమంత్రి మెలోనీకి అభినందనలు అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆమెతో స్నేహం భారత్-ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని, రెండు దేశాల ప్రజలకు సమృద్ధి భవిష్యత్తు నిర్మించేందుకు సన్నిహిత సహకారం కొనసాగించాలని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరాల్లో ఆమె విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందనగా ధన్యవాదాలు ప్రియమైన ప్రధాని మోడీ అని మెలోనీ అన్నారు. ఎక్స్‌లో చేసిన పోస్టులో ప్రియమైన నరేంద్ర మోడీ, మీ మాటలకు, మీ స్నేహానికి ధన్యవాదాలు అని రాశారు. ఇటలీ-భారత దేశం సంబంధం ఈ రోజు ఎప్పటికంటే బలంగా ఉందని అన్నారు. మన చివరి సమావేశంలో ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం ఈ బంధం ప్రాముఖ్యతను, రెండు దేశాల నైపుణ్యాలను కలిపి, వృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలనే సంకల్పాన్ని గుర్తిస్తుందని చెప్పారు. ముందున్న అసాధారణ సహకార అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటలీ, భారతదేశం కలిసి రెండు ఖండాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని, భారత్-మధ్యప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ అభివృద్ధికి కూడా కలిసి పనిచేస్తాయని విశ్వాసాన్ని మెలోనీ వ్యక్తం చేశారు. మోడీ-మెలోనీ స్నేహం సామాజిక మాధ్యమాల్లో 'మెలోడీ' అనే పేరుతో దృష్టిని ఆకర్షిస్తుంది. ఇటీవల రోమ్ పర్యటనలో మోడీ మెలోనీకి మెలోడీ చాక్లెట్ల ప్యాకెట్ బహుమతిగా ఇచ్చిన సందర్భం మళ్లీ చర్చనీయాంశమైంది. ఇరు నాయకుల స్నేహం ద్వైపాక్షిక సంబంధాలను మరింత లోతుగా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# నేడు కరీంనగర్‌కు కేటీఆర్..

మొదటి తరువాయి



నాయకులతో కేటీఆర్ సభ, జన సమీకరణపై చర్చించారు. ఉదయం 10.15 గంటలకు కేటీఆర్ నేరుగా అంబేద్కర్ స్టేడియం చేరుకుని సభలో పాల్గొంటారని తెలిపారు.


# నాణ్యతలో రాజీ వద్దు

మొదటి తరువాయి

నిర్మాణ నమూనా, స్థలం, భవన విస్తీర్ణం, తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాలుగు ఎకరాల స్థలంలో 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి సీఎంకు వివరించారు. భవన నిర్మాణ పనులను పరిశీలించిన సీఎం.. మార్చిలోగా పనులు పూర్తిచేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.
కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని కలెక్టర్ ప్రియాంకను సీఎం ఆదేశించారు. అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం చింతల్ దిన్నె వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయాలని, జాప్యానికి తావులేకుండా వేగం పెంచాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్ఓ రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్పర్సన్ సరస్వతి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సైనిక విన్యాసాలకు సిద్ధమైన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్..

-భారత్--పాక్ సరిహద్దులో 17 రోజులపాటు భారీ డ్రిల్స్
-సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు కొనసాగనున్న విన్యాసాలు
-ఎయిర్‌స్పేస్ ఆంక్షల కోసం నోటమ్ జారీ
-భారత సైనిక కదలికలపై పాక్ నిఘా
-సరిహద్దులో భద్రత పెంచాలని సైనిక అధికారుల ఆదేశాలు
-విన్యాసాలపై పాక్ రక్షణ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష
-భారత వైమానిక దళం సంసిద్ధతపై పర్యవేక్షణ
-ఎయిర్‌స్పేస్ భద్రతకు ప్రత్యేక చర్యలు



ఇండియా సైనిక కార్యకలాపాలను ప్రారంభించిందంటే చాలు పాకిస్తాన్‌లో వణుకు ప్రారంభమవుతుంది. తాజా పరిణామాలే ఇందుకు ఉదాహరణ. భారత నావికాదళం త్వరలో సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు నోటం (నోటీస్ టు ఎయిర్ మిషన్స్) జారీ చేసింది. నావికాదళానికి సంబంధించిన సైనిక విన్యాసాలకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇండియా-పాకిస్తాన్ సరిహద్దులో, రాజస్థాన్‌లో 17 రోజులపాటు నోటం జరగనుంది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 7 వరకు ఈ సైనిక విన్యాసాలు కొనసాగుతాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను వాయుసేన విడుదల చేసింది. అయితే, మన ఎయిర్‌ఫోర్స్ సైనిక విన్యాసాలు చేసేందుకు సిద్ధమవుతుంటే పాకిస్తాన్ వణికిపోతోంది. పాకిస్తాన్ రక్షణ శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండియా చేపట్టనున్న సైనిక విన్యాసాలపై సమీక్ష నిర్వహించారు. ఇస్లామాబాద్‌లో ఉన్న భద్రతా దళాలా చీఫ్ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరిగింది. ఇండియా-పాక్ సరిహద్దులో ఈ సైనిక విన్యాసాల వల్ల కలిగే పరిణామాలపై చర్చించారు. ఇదే సమయంలో భారత సరిహద్దులో నిఘా పెంచాలని అక్కడి సైనిక అధికారులు ఆదేశించారు. మన సైనిక విన్యాసాల్ని పాక్ సైన్యం నిరంతరం పర్యవేక్షించనుంది. భారత వైమానిక దళానికి సంబంధించి చేపట్టే మార్పులు, సంసిద్ధత, నిషేధాలు వంటి అంశాలపై విమాన ఆపరేటర్లు, సంబంధికులకు అందే రక్షణ నోటిఫికేషన్ నోటం. సైనిక డ్రిల్స్ నిర్వహిస్తున్నప్పుడు మామూలుగానే నోటం జారీ చేస్తుంటారు. ఎయిర్‌స్పేస్‌లో నిషేధాజ్ఞలు, భద్రత వంటివి దీని పరిధిలోకి వస్తాయి. 17 రోజులపాటు భారీ సైనిక విన్యాసాలు జరగనున్నాయి.

# ఎల్‌నినో ఉగ్రరూపం..

ం వచ్చే ఏడాది వాతావరణం భయానకం
ం 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులకు అవకాశం
ం ఎల్‌నినో బలపడుతోందని ఐరాస హెచ్చరిక
ం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న ఎల్‌నినో
ం పసిఫిక్ సముద్రంలో పెరుగుతున్న నీటి ఉష్ణోగ్రతలు
ం కరువులు, వరదలు, తుఫాన్ల ముప్పు
ం పలు ప్రాంతాల్లో అడవుల్లో కార్చిచ్చుకు అవకాశం
ం 2027లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు ఛాన్స్
ం వాతావరణ మార్పులతో మరింత పెరగనున్న ముప్పు




జెనీవా:
అతి పెద్ద ఎల్‌నినో రూపుదిద్దు కుంటోందని ఐక్యరాజ్య సమితి(ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ హెచ్చరించారు. 2027లో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) తాజా అంచనా ప్రకారం 2027 ఫిబ్రవరి వరకు ఎల్‌నినో కొనసాగే అవకాశం దాదాపు 100 శాతం ఉంది. ఇంత నిశ్చితంగా ఇంతకుముందు ఎప్పుడూ చెప్పలేదు. పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణంగా పెరిగిన నీటి ఉష్ణోగ్రతల వల్ల ఎల్‌నినో మరింత బలపడుతోంది. 2026 చివరికి చాలా బలమైన స్థాయికి చేరుకుని తీవ్రస్థాయికి వెళ్తుందని అంచనా. దాని ప్రభావాలు 2027లో కూడా కొనసాగుతాయి. మన కళ్లముందే ఎల్‌నినో అతి పెద్దదిగా మారుతోందని గుటెరెస్ అన్నారు. శాస్త్రం సందేహానికి తావు ఇవ్వడం లేదు. భూగోళం ఇంతకుముందు చూడని జలాల్లో ఉంది, ఆ జలాలు వేడెక్కుతున్నాయి అని ఆయన చెప్పారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పైకి వెళున్నాయి, ప్రపంచం తీవ్ర వాతావరణ ప్రమాద మండలంలో ఉందని హెచ్చరించారు. పెరుగుతున్న ప్రమాదాలు, ప్రజలను రక్షించే వాతావరణ చర్యల మధ్య పోటీ నడుస్తోంది, ఈ పోటీని గెలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఎల్‌నినో ఉగ్రరూపం సమాజాలు, ఆర్థిక వ్యవస్థలపై పెద్ద దెబ్బ తీయగలదని డబ్ల్యూఎంఓ చీఫ్ సెలెస్టే సౌలో అన్నారు. కరువులు, వరదలు ఇప్పటికే అంతరాయం, విధ్వంసం కలిగిస్తున్నాయి. ఎల్ నినో బలపడిన కొద్దీ ఇవి మరింత తీవ్రమవుతాయని ఆమె చెప్పారు. మధ్య, తూర్పు భూమధ్యరేఖ పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇంకా పెరుగుతున్నాయి. నినో 3.4 సూచిక 2026 మే నుంచి జులై వరకు సగటున 1.5 డిగ్రీల సెల్సియస్ పైన ఉంది. అది జులైలో 2.0 డిగ్రీల సెల్సియస్ పైనకు చేరింది. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఎక్కువ. వర్షపాత నమూనాలు కూడా మారతాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు, అడవుల్లో కార్చిచ్చు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు, వరదలు, తుఫానులు రావచ్చు. 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మానవ కారణాల వల్ల ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై ఎల్‌నినో మరింత వేడిని జోడిస్తుంది.

# సురేఖను తప్పించడం బాధాకరం

మొదటి తరువాయి

తప్పిదమని ఆయన పేర్కొన్నారు. కొండా సురేఖ కుమార్తె చేసిన తీవ్ర వ్యాఖ్యలను కనీసం ఆమె ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత తీవ్రంగా పరిగణించిందని తెలిపారు. పార్టీ నియమాలను ఖాతరు చేయని వైఖరి కారణంగానే అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మహేశ్‌కుమార్ వివరించారు. రాజకీయ లబ్ధి కోసం, ఒత్తిడి తేవడం కోసం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం సీఎం రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం లేదని తేల్చిచెప్పారు. మంత్రి పదవి నుంచి తొలగించినప్పటికీ, కొండా సురేఖ పార్టీలోనే కొనసాగాలని తామంతా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. పార్టీ విధేయత, క్రమశిక్షణను కాపాడేందుకు అధిష్ఠానం ఈ కఠిన వైఖరి అవలంబించిందని, పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు వ్యవహరించినా హైకమాండ్ చూస్తూ ఊరుకోదని మహేశ్‌కుమార్ స్పష్టంచేశారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్

**సింగరేణి మండలం క్రాస్ రోడ్ వద్ద బైక్ ర్యాలీ, వంట వార్పుతో నిరసన**



**సింగరేణి ప్రతినిధి , సెప్టెంబర్ 4(వార్త సంధ్య )**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మీాజ తాత మధు ఆ పార్టీ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు . ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు, వివిధ డిక్లరేషన్లను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వెయ్యి రోజుల పాలన సందర్భంగా తెలంగాణ లో , రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు .కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు నిర్వహించాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# 22A భూముల సమస్యపై ఇందిరా పార్క్ వద్ద జనసేన భారీ నిరసన దీక్ష



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆస్తిహక్కులను కాపాడాలని, 22-A భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన దీక్ష నిర్వహించారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. 22-A భూముల సమస్యతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న బాధితులకు జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.తరతరాలుగా అనుభవిస్తున్న తమ సొంత భూములను 22-A నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులను అమ్మలేక, రిజిస్ట్రేషన్లు కాక, అత్యవసర సమయాల్లో బ్యాంకుల నుండి రుణాలు పొందలేక ప్రజలు ఆర్థికంగా కుంగిపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, సమగ్ర పరిశీలన చేపట్టి అర్హత ఉన్న భూములను 22-A జాబితా నుండి తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు మరియు జనసైనికులు భారీ బైక్ ర్యాలీగా తరలివచ్చి నిరసన దీక్షకు తమ పూర్తి సంఘీభావాన్ని తెలిపారు.

# శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో శ్రావణ శుక్రవార మహోత్సవం

**వార్తా సంధ్య కూకట్‌పల్లి:**



కూకట్‌పల్లిలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా ఆధ్యాత్మిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.ఉదయం 5 గంటలకు శ్రీ భువనేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అమ్మవారిని 108 శ్రేష్ఠమైన చీరలు, 108 కలవ పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఉదయం 10:30 గంటలకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మంత్రపుష్పం సమర్పించి, భక్తులకు హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

# సింగరేణిలో మద్యం దందాపై ఫిర్యాదులు.. అధికారుల నిఘా ఏదీ?

**-తెల్లవారుజామున 6 గంటల నుంచే గ్రామాలకు ఆటోల్లో మద్యం సరఫరా చేస్తున్నారంటూ ఆరోపణలు**

**-క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనపు వసూళ్లు.. పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదంటున్న ప్రజలు**




**సింగరేణి ప్రతినిధి,సెప్టెంబర్ 4, (వార్త సంధ్య ):**
సింగరేణి మండల పరిధిలో మద్యం విక్రయాలు, అధిక ధరల వసూళ్లపై ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని నాలుగు మద్యం దుకాణాల నుంచి గ్రామాలకు మద్యం సరఫరా జరుగుతోందని, తెల్లవారుజామున 5.30 గంటల నుంచే ఆటోల ద్వారా 41 గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలకు మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రానికి, పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలపై నిఘా పెట్టాల్సిన ఆప్కారి శాఖ ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.50 అదనంగా?
మద్యం దుకాణాల్లో ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే అధికంగా ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలుమార్లు ఆప్కారి శాఖ అధికారులకు, కారేపల్లి ఆప్కారి శాఖ సీఐకి ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదులపై వెంటనే తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అధికారులు స్పందించకపోవడంతో మద్యం దుకాణాల నిర్వాహకులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**యువత భవిష్యత్తుపై ఆందోళన**
గ్రామాల్లో మద్యం అందుబాటులోకి రావడంతో చదువుకున్న యువతలో కొంతమంది మద్యానికి బానిసలవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే గ్రామాలకు మద్యం చేరుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
మద్యం విక్రయాలపై నియంత్రణ లేకపోతే గ్రామాల్లోని యువత, కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. తమ ఓట్లతో ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నప్పటికీ గ్రామాల్లో జరుగుతున్న ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై కూడా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా చర్యలు ఎందుకు లేవు?
ఆప్కారి శాఖ సీఐకి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు స్పష్టమైన స్పందన కనిపించలేదని స్థానికులు అంటున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో తనిఖీలు, దాడులు జరగలేదని వారు పేర్కొంటున్నారు.
సింగరేణి మండలంలోని నాలుగు మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారా? తెల్లవారుజామున గ్రామాలకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత మద్యం దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో అక్రమ మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరుతున్నారు.
ఫిర్యాదులు పదేపదే వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు?
గ్రామాలకు తెల్లవారుజామునే మద్యం చేరుతున్న ఆరోపణలపై ఆప్కారి శాఖ ఎప్పుడు చర్యలు తీసుకుంటారు ?
యువత భవిష్యత్తును కాపాడేందుకు అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారు?
అనేది ఇప్పుడు సింగరేణి మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

# కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 4.**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల వైఫల్యాలు, 420 హామీల మోసాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాటలో భాగంగా వంట వార్పు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
**వేదిక: మెహిదీపట్నం బస్ స్టేషన్**
ఈ నిరసన కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గం బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్ గారు, నియోజకవర్గ సీనియర్ నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, డివిజన్ కమిటీ సభ్యులు, నాయకులు సి. సంజయ్, అభిషేక్ రాజ్, పవన్, రాజ్ రెడ్డి, ఇక్బాల్ అలీ, యూసుఫ్, ఖాన్ సబ్, బాబా, అలీ తదితరులు, అలాగే కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించారు.
**పాల్గొన్న ముఖ్య నాయకులు:**
మురళీధర్, దయానంద్, వాల్మీకి, అహ్మద్ అలీ, గురు బసవయ్య, ఖలీం, మోహన్, నయీం, నరేందర్ బిల్లం, రియాజుద్దీన్, శ్రీశైలం గౌడ్, సి. లక్ష్మీనారాయణ, బాలచందర్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ ముదిరాజ్, మెట్టు నటరాజ్, బాబురావు, మహేష్ ముదిరాజ్, సుజత్, సునీల్, బాబా భాయ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన...
ప్రజా హక్కుల సాధన కోసం...
ప్రజా సమస్యల పరిష్కారం కోసం...

ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదు!
ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరుబాట కొనసాగుతుంది!

# కేపీహెచ్‌బీలో పాత నేరస్థుడి అరెస్ట్

**-70 వేల విలువైన చోరీ సొత్తు స్వాధీనం**

**వార్తా సంధ్య కూకట్‌పల్లి :**




కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన పాత నేరస్థుడిని సీసీఎస్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 70,000 విలువైన చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.
పోలీసు వివరాల ప్రకారం.. ఆగస్టు 29న ఉదయం కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-1, రోడ్ నంబర్ 2లోని 'గణేష్ విల్లా'లో నివాసితులు నిద్రిస్తున్న సమయంలో నిందితుడు లోపలికి ప్రవేశించాడు. ఇంట్లోని లెనోవో ఐడియాప్యాడ్ ల్యాప్‌టాప్, మోటోరోలా G96 5G మొబైల్ ఫోన్‌ను చోరీ చేసి బైక్‌పై పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు క్రైమ్ నంబర్ 1111/2026, సెక్షన్ 305(ఘ) దీచీూ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఘటనా స్థలంలోని సిసిటివి ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల విశ్లేషణ ద్వారా కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన పాత నేరస్థుడు పాటిల్ సందీప్ అలియాస్ సందీప్ (27) ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 4న ఉదయం కేపీహెచ్‌బీ లులు మాల్ సమీపంలో చోరీ సొత్తును విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.అతడి వద్ద నుంచి లెనోవో ల్యాప్‌టాప్, మోటోరోలా ఫోన్, నేరానికి వాడిన బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 200 బైక్ (TS 08 JT 7156) మరియు ఒక వీవో ఫోన్‌ను రికవరీ చేశారు. గతంలోనూ పలు నేరాల్లో ప్రమేయం ఉన్న ఈ నిందితుడిని అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించిన సీసీఎస్ కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీసు బృందాలను అధికారులు అభినందించారు.

# ప్రతి ఇంటికి రెండు మొక్కలు పంపిణీ

**-పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం**

**- సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్**




**సింగరేణి ప్రతినిధి,సెప్టెంబర్ 04 (వార్త సంధ్య )**
గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఇంటికి ఒక పూల మొక్క, ఒక గానుగ మొక్క చొప్పున పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గాదేపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ కె. కెవ్వులియా, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాల్లో అందించిన రెండు మొక్కలను నాటి, వాటిని సంరక్షించి పెంచాలని కోరారు. మొక్కలను పెంచడం ద్వారా గ్రామంలో పచ్చదనం పెరిగి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా సంరక్షిస్తూ గాదేపాడు గ్రామపంచాయతీని పచ్చదనంలో ఆదర్శ గ్రామపంచాయతీగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు

# జేఎన్‌టీయూ ప్రాంగణంలో విద్యార్థుల ఘర్షణ

**- కేసు నమోదు, ఎనిమిది మంది అదుపులోకి**

**వార్తా సంధ్య కూకట్‌పల్లి**
హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ హాస్టల్ ప్రాంగణంలో రెండు విద్యార్థుల వర్గాల మధ్య చెలరేగిన తీవ్ర వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే విషయమై ప్రారంభమైన వాగ్వాదం, చివరికి విద్యార్థి గుగులోత్ వసంతపై భౌతిక దాడికి దారితీసింది. గురువారం అర్ధరాత్రి డయల్-112 ద్వారా సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున 2:00 గంటల




ప్రాంతంలో ప్రధాన గేటు వద్ద విద్యార్థులు మళ్లీ ఘర్షణకు దిగారు. విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి యత్నించడమే కాకుండా, పక్కనే ఉన్న కేఎస్ఆర్/కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగి వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగించారు.
బాధితుడు వసంత ఫిర్యాదుతో పాటు హెడ్ కానిస్టేబుల్ కె. రాజు నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రశాంత్, సందీప్, ఇస్మాయిల్ సహా ఎనిమిది మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై జి. శశిధర్ గౌడ్, ఏఎస్సై ఎస్. వెంకటేష్ ఈ కేస్ దర్యాప్తును వేగవంతం చేశారు.

## సంపాదకీయం

### ప్రభాత సంధ్యల

# భ్రమాభంగం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పాలకుని బుద్ధి బయటపడ్డది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా లంకెబిందెల ప్రస్తావన తెచ్చిండు. ముఖ్యమంత్రి నిట్టూర్పులోనే పాలనా తత్వానికి సంబంధించిన ఒక ప్రమాదకరమైన సంకేతం బయటపడ్డది. లంకెబిందెలంటేనే ఏ కష్టం లేకుండా తేరగా తవ్వుకుపోవడం. అందినకాడికి దండుకోవడం. 'లంకెబిందెల' మనస్తత్వమే రైతు సంక్షేమానికి కత్తెర వేసింది. కాంగ్రెస్ నేతలు రూ.2 లక్షల రుణమాఫీ అని చెప్పారు. కానీ రేషన్ కార్డులు, కుటుంబ నిర్ధారణల పేరిట రకరకాల కొర్రీలు పెట్టి వేలాది మంది అర్హులైన రైతులను పథకానికి దూరం పెట్టిండ్రు. ఎకరానికి రూ.15,000 ఇస్తామన్న రైతు భరోసాకు ఆంక్షల గిరిగీసి, ఆఖరికి రూ.12 వేలకు కుదించిండ్రు. దాన్ని కూడా వాయిదాలు పెట్టి సాగును సావు మీదికు తెచ్చిండ్రు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామన్న మహాలక్ష్మి హామీ దిక్కూమొక్కూ లేదు. అదనంగా తులం బంగారం సంగతి దేవుడెరుగు, అసలు కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ పథకానికే ఎసరు పెట్టిండ్రు. యువతను ఆకట్టుకోవడానికి 'జాబ్ క్యాలెండర్' ఆశలు రేపింది. ఏటా జూన్ 2న నోటిఫికేషన్లు, డిసెంబర్ 9 నాటికి నియామక పత్రాలు అని ఊరించింది. అధికారంలోకి వచ్చి ఏం చేసింది? జాబ్ క్యాలెండర్‌కు ఉరేసి గోడకు నిర్జీవంగా వేలాడదీసింది. గత ప్రభుత్వ హయాంలో పరీక్షలు పూర్తయి, తుది దశకు చేరిన పోస్టులకు నియామక పత్రాలు అందిస్తూ ఫొటోలు దిగింది. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తమ గొప్పలుగా ప్రచారం చేసుకున్నది. మళ్లీ ఇప్పటి వరకు గ్రూప్–2, గ్రూప్–3 లాంటి కొలువుల నోటిఫికేషన్ల ఊసే లేదు. నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని బడ్జెట్ ప్రసంగాల నుంచి కూడా తుడిచేశారు. అశోక్‌నగర్ గ్రంథాలయాల నీడల్లో పుస్తకాలతో కుస్తీ పడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్ కోసం యువత వేచి చూస్తుంటే నోటిఫికేషన్ రాలేదు. కానీ లాఠీలతో పోలీసులు వచ్చిండ్రు. అర్ధరాత్రి వేళల్లో లాఠీచార్జ్‌లు చేయించడం, నిర్బంధాల ఉక్కుపాదం మోపడమే పాలననా?రేవంత్ సర్కార్ తెచ్చిన హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పేద, మధ్యతరగతి వర్గాల్లో తీవ్రమైన అభద్రతా భావాన్ని ముంచెత్తింది. చెరువుల పరిరక్షణ ముసుగులో పేదల నివాసాలపై బుల్డోజర్లు నడిపించి, బడా బాబుల ఫామ్ హౌస్‌లను వదిలేసిన తీరును రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమే తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌ను తప్పించాలనే కఠిన ఆదేశాలు ఇచ్చింది. దాదాపు లక్షన్నర కోట్ల రూపాయల భారీ అంచనాతో తలపెట్టిన మూసీ ప్రాజెక్ట్, ఫోర్త్ సిటీ, దానిలో జరుపుతున్న సమ్మిట్‌ల విధానపత్రాల్ని నిశితంగా పరిశీలిస్తే.. సామాన్యుడిని విస్మరించి, కార్పొరేట్ భ్రమలను సృష్టించి విఫలమైన చంద్రబాబు 'విజన్ 2020' పునారావృతమవుతున్నదని వెయ్యి రోజుల పాలన తేల్చింది. కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన 'భూమాత' రెవెన్యూ చట్టం హామీ కూడా వెయ్యి రోజుల తర్వాత తీవ్ర నిరాశనే మిగిల్చింది. కాంగ్రెస్ పాలకులు ధరణి అధ్యయన కమిటీల పేరుతో ప్రజలను ఏమార్చారు. రాత్రికి రాత్రే 22–ఏ అని తెచ్చి 7 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిండ్రు. సొంత భూమిని అమ్ముకొనే హక్కు రైతుకు, సొంత ఇంటిని విక్రయించే హక్కు, పిల్లలకు ఇచ్చుకొనే హక్కు యజమానికి లేకుండా చేసిండ్రు. బ్యాంకుల్లో కుదువబెట్టి రుణం కూడా తీసుకోలేని దుస్థితిని తీసుకొచ్చిండ్రు. రాష్టంలోని ప్రతి మూడిండ్లలో ఒక ఇల్లు వివాదమే. 22–ఏ కింద పెట్టిన ప్రతి ఎకరం కూడా ప్రభుత్వ వైఫల్యమే. ఆ తప్పును సరిదిద్దకుండా రైతులు మళ్లీ తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ దరఖాస్తులతో ప్రదక్షిణలు చేయిస్తే అది పాలన ఎప్పటీ కాదు, దుర్మార్గమే. ఒక ప్రాంత అస్తిత్వంతో ముడిపడిన ప్రతీకల విషయంలో పాలకులు సున్నితంగా వ్యవహరించాలి. కానీ మొదటి నుంచి రేవంత్‌రెడ్డికి ఆ సహానుభూతి లేదు. తెలంగాణ తల్లి కొత్త విగ్రహం రూపకల్పన గానీ, సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహ స్థాపన గానీ, ఆంధ్రా ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు ఉద్యమకారులకు, సమాజానికి తీవ్ర మనస్తాపం కలిగించాయి. పాలకులు సాంస్కృతిక అస్తిత్వాన్ని విస్మరిస్తే ఆ అభిప్రాయమే సమాజంలో శాశ్వతంగా స్థిరపడిపోతుంది. తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే. దశాబ్ద కాలంలో పాటు తెలంగాణ మట్టి స్వరూపాన్నే మార్చిన కేసీఆర్‌ను వెయ్యి రోజుల్లో ప్రజలు గుర్తుచేసుకోని రోజంటూ లేదు. 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్తు, కాళేశ్వరం లాంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, ఎండిన బీడును కూడా సస్యశ్యామలం చేసిన తీరు, కోటి ఎకరాల మాగాణం ఒక భౌతిక వాస్తవం. పల్లెలు, పట్టణాలు ప్రగతిబాటలో పచ్చగా రూపుదిద్దుకున్న రాష్ట్ర ముఖచిత్రం స్వయం సమృద్ధికి ప్రతీకగా నిలిచింది.ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అసలైన అభివృద్ధిని విస్మరించి, అడ్డూ అదుపు లేని మాటలతో కేసీఆర్‌ను తిట్టడమే పాలన అనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజుల్లో గత పాలనను అకారణంగా నిందించడం రాజకీయం కావొచ్చు. కానీ వెయ్యి రోజులు గడిచిన తర్వాత కూడా ప్రతి వైఫల్యానికీ గత ప్రభుత్వాన్నే సాకుగా చూపించడం నేటి పాలకుల చేతకానితనానికి నిదర్శనం. నేటి పాలనా వైఫల్యాలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ నేతలు, అధినేతల మీదనే ఉన్నది. కొలువుల క్యాలెండర్ ఏమైంది? విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు పరిష్కారం ఎప్పుడు? గురుకులాల్లో పేద పిల్లల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? మూసీ, హైడ్రా పేర్లతో పేదల ఇండ్లపై బుల్డోజర్లు నడుపడమే పాలననా? ఈ ప్రశ్నలు నేడు తెలంగాణ సమాజంలో ఆవేదనతో నిండిన గుండెల్లోంచి వెయ్యి పడగలై కాంగ్రెస్ పాలనపైకి లేస్తున్నాయి.

# యువతకు చేరువగా రాహుల్



కాంగ్రెస్ ముక్త్' నినాదంతో తొలిసారి బిజెపికి పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ తీసుకొచ్చి, ప్రధానమంత్రి పదవి చేపట్టినప్పటి నుండి గత పుష్కరకాలంగా దేశ రాజకీయ అజెండాను నరేంద్ర మోడీ నిర్దేశిస్తున్నారు. ఆయన ఇచ్చే నినాదాల చుట్టూ మిగిలిన రాజకీయ పక్షాలు అన్ని తిరిగే పరిస్థితులు కల్పిస్తున్నారు. దానితో ఆయన తిరుగులేని నాయకుడిగా ఎదగడంతోపాటు ఒక్కొక్క రాష్ట్రంలో ప్రతిపక్షాల కోటలను కూల్చివేస్తున్నారు. అయితే, 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలవబోతున్నామనే భరోసా వ్యక్తం చేస్తూ బిజెపి పూర్తి మెజారిటీ కూడా తీసుకురాలేకపోవడం, టిడిపి, జెడియుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిరావడంతో ఆయనపట్ల ప్రజలలో ప్రతికూల సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా ప్రతిపక్షాలలో మోడీని ఎదుర్కొనే నాయకత్వం కనిపించకపోవడంతో ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బిజెపి తిరుగులేని విజయాలు సాధిస్తూ వచ్చింది.ఇటువంటి పరిస్థితుల్లో నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా యువత ఉద్యమాలు చేపట్టడం, బలప్రయోగం ద్వారా వాటిని అణచివేసే ప్రయోగాలు విఫలం కావడంతో మొదటిసారిగా ప్రజాగ్రహంతో ప్రధాని మోడీ తన కీలక మంత్రి ఒకరు ధర్మేంద్ర ప్రధాన్‌ను త్యాగం చేయాల్సి వచ్చింది. రాజకీయాలకు అతీతంగా యువతలో ప్రభుత్వ పనితీరుపట్ల తీవ్రమైన అసమ్మతి, ఆగ్రహం నెలకొందని వెల్లడైంది. ముఖ్యంగా నిరుద్యోగం, ధరల పెరుగుదల, అంతులేని అవినీతి, సామాన్య ప్రజలకు అందుబాటులో లేని విద్యావ్యవస్థ, విఫల ప్రభుత్వ యంత్రాంగం కారణంగా మోడీ, బిజెపి రాజకీయంగా భారీగా మూల్యం చెల్లించక తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ సంకేతాలను మొదటగా గ్రహించి నూతన రూపంలో యువత ముందుకొచ్చిన నాయకుడు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అని చెప్పవచ్చు. ఢిల్లీలో సిజెపి నిరసనలు ప్రారంభానికి ముందే కోచింగ్ కేంద్రాలను ప్రసిద్ధి చెందిన రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమం ద్వారా యువత ముందు ఓ బలమైన నాయకుడిగా వచ్చారు. జంతర్ మంతర్ ముందు నిరసన ఉద్యమం ముగిస్తున్న సమయంలో నేరుగా ప్రధాన మంత్రి ఇంటివద్దనే ధర్నా నిర్వహించడం ద్వారా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయలేక తప్పని పరిస్థితి కల్పించారు. ఆ తర్వాత ఢిల్లీలో ఓ పోలీస్ స్టేషన్ ముందు మెరుపు బైటాయింపు ద్వారా పెల్లెట్ తుపాకీ దెబ్బలకు గురైన ఓ యువకుడి ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధంగా చేయగలిగారు. ఆ తర్వాత ప్రయోగరాజ్ పుణెలలో జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' కార్యక్రమాలు గాంధీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వ్యూహంలో వచ్చిన మార్పును ప్రతిబింబించాయి. మహిళలపట్ల ఆందోళన వ్యక్తం చేయడానికి రాజకీయ పార్టీలు సాధారణంగా వాడే 'సంక్షేమం' లేదా 'సాధికారత' వంటి మృదువైన పదాలను కాకుండా ఆయన 'పితృస్వామ్య వ్యవస్థను బద్దలుకొట్టడం' గురించి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, బిజెపిలకు 'మనుస్మృతి మనస్తత్వం' ఉందని ఆరోపించారు. ఈ సమావేశం నిర్వహణ తీరు కూడా భిన్నంగా జరిగింది. రాహుల్ వేషధారణలోనూ మార్పు కనిపించింది. సాధారణంగా ఆయన ధరించే లేత గోధుమ రంగు ప్యాంట్, తెల్లని టీ–షర్ట్ (ఒక చేతిని జేబులో పెట్టుకునే అలవాటుతో) కాకుండా, ఈసారి ఆయన కాస్త స్టైలిష్‌గా ఉండే పసుపు రంగు షర్ట్ ధరించారు. అంతకుముందు ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన 'ఛాత్రోన్ కి గూంజ్' సభలో ఆయన గులాబీ రంగు షర్ట్ ధరించారు. రాహుల్ రూపురేఖల్లో లేదా శైలిలో ఈ మార్పు వెనుక ఉన్న ఉద్దేశం కేవలం ఇప్పటివరకు పార్టీ తగినంతగా దృష్టి సారించని 'జెన్ –జెడ్' తరం వారిని, ముఖ్యంగా మహిళలను ఆకర్షించడం అని స్పష్టం అవుతుంది. పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యావంతులైన, మధ్యతరగతి, అగ్రవర్ణాలకు చెందిన చాలామంది యువత ఆయన 'సాంప్రదాయేతర' పద్ధతులను ఇష్టపడుతున్నట్లు కనిపిస్తున్నది. మోడీ ప్రధాని కాగానే కాంగ్రెస్ ఉనికిని సమాధి చేసే ప్రయత్నంలో భాగంగా ఆ పార్టీ కీలక నేత రాహుల్‌ను 'పప్పు' అంటూ ప్రచారం చేయడం ప్రారంభించారు. వరుసగా ఆయన నేతృత్వంలో ఎన్నికల్లో పరాజయాలకు కేంద్రబిందువు కావడంతో ఆయనను 'విఫల నేత'గా సొంత పార్టీ వారు కూడా పరిగణించే విధంగా చేయగలిగారు. అందుకు రాహుల్ వైఖరి కూడా తోడయింది.అంటరానితనాన్ని ప్రోత్సహిస్తుందని, అలాగే అణగారిన కులాలు, మహిళలకు సమానత్వం, స్వయంప్రతిపత్తిని నిరాకరిస్తుందని విమర్శిస్తూ సరిగ్గా ఒక శతాబ్దం క్రితం, 1927లో బి.ఆర్. అంబేద్కర్ బహిరంగంగా మనుస్మృతిని దహనం చేశారు. ఆ తర్వాత, ఆగస్టు 29న, హల్ద్వానిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుభ్రం చేసిన వారిపై చర్యలు తీసుకోని బిజెపిని గాంధీ తీవ్రంగా విమర్శించారు. ఖర్గే దళితుడు కావడం వల్లే ఇలా జరిగిందని ప్రతిపక్ష నాయకుడు వాదించారు. ఈ 'శుద్ధీకరణ' చర్యను దళితులపై కొనసాగుతున్న అంటరానితనంతో ముడిపెట్టడానికి గాంధీ ప్రయత్నించారు. 2014 నుండి తన బేస్‌ను విస్తరిస్తూ ఒబిసిలు, దళితులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, బిజెపి అంతిమంగా అగ్రవర్ణాల పార్టీగానే మిగిలిపోయిందని ప్రజలకు చూపించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో తమకు సంబంధం లేదని బిజెపి ప్రకటించి ఎదురుదాడికి దిగింది. కానీ గాంధీ మాత్రం వెనక్కి తగ్గలేదు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీకి చెందిన దళిత అధ్యక్షుడికే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక గ్రామాల్లోని సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు దళితులు తిరిగి ఆ పార్టీ వైపు మళ్లడంపైనే ఆధారపడి ఉందని గాంధీకి తెలుసు. రాజ్యాంగబద్ధంగా లభించిన రిజర్వేషన్లను కోల్పోతామనే దళితులలో భయం కలిగించడం ద్వారానే 2024 ఎన్నికల్లో బిజెపి సొంతంగా మెజారిటీ సాధించలేకపోయింది. హిందీ మాట్లాడే ప్రాంతాల్లో ఒబిసిల విషయంలో పెద్దగా పురోగతి సాధించలేకపోయినప్పటికీ, గాంధీ వారిని ఆకర్షించే ప్రయత్నాలను విరమించుకోలేదు. కులగణనలో ప్రశ్నలను మార్చాలని కోరుతూ ఆయన, ఖర్గే ప్రధాన మంత్రి మోడీకి రాసిన లేఖ ఆ వర్గాలను ఆకట్టుకొనే ప్రయత్నమే. ఆ విధంగా యువత, మహిళలు, దళిత, ఒబిసిలను ఆకట్టుకోవడం ద్వారా 2019 ఎన్నికలలో కాంగ్రెస్ విజయావకాశాలు మార్గం ఏర్పచేందుకు సరికొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, రాహుల్ గాంధీకి అసలు సమస్య ఛిన్నాభిన్నమైంది కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం. ప్రజలలో పనిచేసే నాయకులు కనిపించడం లేదు. భజనపరులతో పార్టీ యంత్రాంగం మొత్తం నిండిపోయి ఉంది. సంస్థాగత నిర్మాణం బలహీనం కావడంతో పటిష్టమైన బిజెపి ఎన్నికల యంత్రాంగాన్ని ఎదుర్కోవడం ఓ పెద్ద సవాల్‌గా పరిణమించింది.

# నిర్లక్ష్యమే వరద ప్రళయాలకు సాక్ష్యం




నేపాల్ వరద ప్రళయం ఇంకా పొంచి ఉందనే భయం ప్రజల్లో వెంటాడుతోంది. మరోమారు ఏడు జిల్లాలకు వరద హెచ్చరికలను ప్రభుత్వం జారీ చేసింది. రసువా, సువాకోట్, దాడింగ్, గోర్ఖా, తనాహున్, నవల్సరాపి, చిత్వాన్ జిల్లాల్లో నదుల వెంబడి ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. టిబెట్ నేపాల్ సరిహద్దులో ఒక భారీ హిమానీనదం కూలిపోవడంతో ఈ వరద ప్రళయం ముంచుకొచ్చింది. ఇప్పటికి మృతుల సంఖ్య బుధవారం (2.9.26) నాటికి వెయ్యి దాటింది. వారం రోజులు గడిచినా ఇంకా 3900 మంది జాడ ఇప్పటికీ తెలియడం లేదు. వీరిలో 600 మంది కార్మికులు త్రిశూలీ నది ఒడ్డున ఉన్న జలవిద్యుత్ కేంద్రాల సొరంగాల్లో చిక్కుకుని ఉన్నారని తెలుస్తోంది. సొరంగాల్లో ఆక్సిజన్ పంపిస్తున్నారు. ఇంకా బాధితుల కోసం గాలింపు సాగుతోంది. చైనానేపాల్ దేశాల సైనిక బృందం ఈ సహాయ చర్యలకు నాయకత్వం వహిస్తుండగా, భారత్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా దేశాల సహాయ బృందాలు కూడా గాలింపు చేపట్టాయి. నేపాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విపత్తు సహాయ నిధికి రూ. 363.94 కోట్లు ఆర్థిక సహాయం లభించింది. సువాకోట్ లోని త్రిభువన్ త్రిశూలి సెకండరీ పాఠశాల నిర్మాణానికి సహాయం చేస్తామని భారత్ ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి బృందాలు కూడా నేపాల్‌కు చేరుకున్నాయి. 22వేల మంది పిల్లల్లో 2600 మందికి చికిత్స అవసరమని, వందలాది మంది గర్భిణులకు పోషకాహార సహాయం అవసరమని ప్రకటించాయి. నేపాల్ దేశం ఎక్కువగా జలవిద్యుత్‌పైనే ఆధారపడింది. అనేక సంవత్సరాలుగా జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం సాగుతోంది. నిర్మాణంలో ఉన్న 11 జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా దెబ్బతిన్నాయి. వాతావరణ మార్పులతోపాటు హిమాలయ దేశం నేపాల్ ఎదుర్కొంటున్న ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. ఇప్పుడొచ్చిన వరదలు సామాన్యమైనవి కావు. అందుకనే ప్రపంచ దేశాలన్నీ నేపాల్‌కు సహాయం అందిస్తున్నాయి. ఇప్పటివరకు భారత్, చైనా, అమెరికా, బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతార్, జపాన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా సహా అనేక మిత్రదేశాలు తమ స్నేహ హస్తం అందించాయి. గత ఏడాది జులై 12 తెల్లవారు జామున నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో కొట్టుకుపోయి మొత్తం 65 మంది ప్రయాణికులు జలసమాధి అయిన దుర్ఘటన అందరికీ తెలిసిందే. దక్షిణాఫ్రికా వరకు తుపాన్లు చెలరేగడానికి, హిమాలయాల పర్యావరణానికి సంబంధం ఉందని ఇండోఅమెరికా మాన్సూన్ స్టడీ వెల్లడించింది.

హిమానీ నదాలు దశాబ్దానికి 30 నుంచి 60 మీటర్ల వంతున దాదాపు 10,000 వరకు కుదించుకుపోతున్నాయి. హిమాలయాల్లో ఎక్కువ భాగాన్ని ధ్వంసం చేసిన 2015 నాటి కేదార్‌నాథ్ విషాద సంఘటన నుంచి పాలకులు గుణపాఠం నేర్చుకోలేదనిపిస్తోంది. కొండచరియల ప్రమాదాలపై 2020లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన సర్వేలో భారత్ లోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, ఈశాన్యం లోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రమాదకరమైన ప్రాంతాలుగా వెల్లడించింది. రోడ్లు, రైల్వే, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలు విచ్చలవిడిగా చేపట్టడం వల్లనే ఈ ప్రమాదాలు ముంచుకొస్తున్నాయని జియోలాజికల్ సర్వే హెచ్చరించినా పాలకులకు కనువిప్పు కలగడం లేదు. కొండచరియల ముప్పు తప్పించడానికి ఇంజినీరింగ్ నిర్మాణాలు చేపట్టడం అవసరమని కూడా జియెలాజికల్ సర్వే సూచించింది. అయినా సరే పట్టించుకోకుండా లంబ్డింగ్ సిల్చార్ బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని చేపట్టారు. ఈ రైల్వే నిర్మాణంలో 2022లో 58 చోట్ల గండ్లు పడ్డాయి. జిరిబాం ఇంఫాల్ సెక్షన్‌లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించడానికి, తగిన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి 'నేషనల్ ల్యాండ్ స్లైడ్ ససెప్టెబిలిటీ మేపింగ్ అనే ప్రక్రియను అమలు చేయవలసి ఉంటుందని జియోలాజికల్ సర్వే సూచించింది. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో అత్యధిక సంఖ్యలో చెట్లు కూల్చివేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్య కాలంలో 10.76 మిలియన్ చెట్లు కూలిపోయాయి. అరుణాచల్‌లోని భారీ డిబాంగ్ డ్యామ్ నిర్మాణం కోసం 2.7 లక్షల చెట్లను కూల్చి వేశారు. డెహ్రాడూన్‌లో ప్రాజెక్టుల కోసం 11,000 చెట్లను కూల్చివేయడానికి ప్రభుత్వ వర్గాలు సిద్ధం కాగా, సుప్రీం కోర్టు అడ్డుచక్రం వేసి ఆపగలిగింది. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తుండడంతో నేల దృఢత్వం దెబ్బతిని కొండచరియలు విరిగి పడడానికి కారణమవుతోంది. వాటికి చేరువలో ఉన్న జననివాసాలు నేలమట్టం అవుతున్నాయి. పర్వత ప్రాంతాల్లో నేల క్షీణించి కోతకు గురవ్వడం, జోషిమఠ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో విపరీత పరిణామాలు సంభవించడం చర్చనీయాంశమవుతున్నాయి. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై చర్చలు కూడా జరుగుతున్నాయి. హిమాలయ రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం క్లిష్టమైన సమస్య. అందుకనే శాస్త్రీయ విశ్లేషణ ప్రకారం నిర్మాణాలు చేపట్టడం అవసరం. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు లబోదిబోమనడం, ఎంతమేరకు నష్టం జరిగిందో మదింపు చేయడం తప్ప అసలు ఈ వైపరీత్యాలకు దారితీసే మూల కారణాలేమిటో, వాటిని ఎలా నివారించగలమో అన్న తక్షణ చర్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ప్రకృతిపరంగా కొన్ని వైపరీత్యాలు జరుగుతుండగా, మానవ కల్పిత చర్యల వల్ల అంతకన్నా ఎక్కువ గానే ప్రకృతికి నష్టం జరుగుతోంది.

వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com epaper.vaarthasadhya.com

# కెపిహెచ్‌బి కాలనీ శివాలయంలో వైభవంగా శ్రావణ పూజలు



**వార్త సంధ్య కూకట్పల్లి :**
నాలుగో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కెపిహెచ్‌బి కాలనీలోని శ్రీ శివాలయంలో వెలసిన కామాక్షి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రకరకాల సుగంధ పుష్పాలతో నేత్రపర్వంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనలు సమర్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం అందించారు.

# గోవధ నియంత్రణలో ప్రభుత్వం విఫలం

-యుగ తులసి ఫౌండేషన్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 4.**
శుక్రవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోవులను వధించే వారిపై ఎలాంటి చర్యలు ఎంతమందిపై తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు అక్రమ స్టార్టర్ హౌస్ బీఫ్ షాపులను పూర్తి సీజీశీగ్ చేయాలని ఆయన కోరారు గోవులను తరలిస్తుంటే సరిహద్దు చెక్పోస్టులు ఏం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు 2000వేల కోవులు అక్రమంగా నరికివేత గురవుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వివరిస్తుందని ఆయన విమర్శించారు రేవంత్ రెడ్డి చట్టం పుస్తకాల్లో ఉండటం కాదు గ్రౌండ్ అమలు కావాలి చట్టాలను కాల్ రాస్తూ హైకోర్టు ఉత్తర్వులను ఏ విధంగా అమలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు బోనులో నిలబడడంతో పాటు వీధుల్లో ప్రజాస్వామ్యాన్ని నిలదీస్తున్నారని ఆయన చెప్పారు నవంబర్ 17వ తేదీన గో సడక్ బంద్ 48 గంటలు జాతీయ రహదారి దిగ్బంధం చేస్తామని ఆయన చెప్పారు విజయవాడ కొత్తగూడెం చౌరస్తా పోచంపల్లి జాతీయ రహదారి వద్ద వేలాది వాహనాలతో 48 గంటల పాటు జాతీయ రహదారి దిగ్బంధం గో సడక్ బంద్ పేరుతో పూర్తిస్థాయి దిబ్బంధం చేస్తామని 1000 గోవులతో స్వయంగా తాను స్వయంగా అక్కడ బయట ఇస్తానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులను కోరారు ఈ కార్యక్రమంలో సంగమేష చారి నాగరాజు కుప్ప శ్రీనివాస స్వామి చంద్ర స్వామి రిటైర్డ్ జడ్జి మల్యాద్రి టి అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# వాడవాడలా ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించిన కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు



**తాళ్లరేవు, (వార్త సంధ్య) సెప్టెంబర్ 4.**
కాకినాడ జిల్లాలోని అన్ని మండలాల్లోనూ వాడవాడలా కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించి,కృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోనూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు,కార్యక్రమాన్ని తిలకించేందుకు చిన్నపిల్లల మొదలు వృద్ధుల వరకు ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామంలో గల రాధాకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులతో పాటు ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచి కొక్కిలిగడ్డ లోకేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# పొనూర్ గ్రామంలో ఉచిత దంత వైద్యశిబిరం



**, జైపూర్, సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
జైపూర్ మండలం పొన్నూరు గ్రామంలో తేది 04.09.2026 రోజున పౌనూర్ గ్రామపంచాయతీలో దంత వైద్య శిబిరాన్ని సర్పంచి వేముల సుధా తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు చేసి ప్రజలకు ఉచిత సేవ చేయడం జరిగింది. శ్రీకాంత్ దంత వైద్య యజమాన్యం ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని పౌనూర్ గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈరోజున ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఉన్నతాధికారుల సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, దీని ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, తద్వారా ముందస్తుగా వ్యాధి నివారణ చర్యలు చేపట్టవచ్చు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డా. సుమలత ఏం డి ఎస్,డా. కిరణ్మయి బి డి ఎస్ మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో సుమారు 100 మంది వరకు వైద్యపరీక్షలు చేయించుకున్నారని, వారికి తగు విధంగా మందులు పంపిణి చేశామని తెలిపారు.

# కృష్ణాష్టమి రోజున మహాలక్ష్మి పవళింపు సేవా నిర్వహించిన భక్తులు



**మంథని,సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
శ్రావణ మాసంలో వచ్చిన కృష్ణాష్టమి పుణ్యతిథిని పురస్కరించుకొని శ్రావణ శుక్రవారం మంథని పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో భక్తులతో కోలాహలంగా మారింది. ఆలయంలో మహిళా భక్తులు సాయంత్రం మహాలక్ష్మి దేవి పవళింపు సేవ కార్యక్రమాన్ని మధురమైన గాత్రంతో నిర్వహించారు. ఉదయం 4 గంటల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం నాలుగు గంటలకు అమ్మవారికి అభిషేకం, 6 గంటలకు అర్చన అనంతరం అమ్మవారిని అలంకరించారు. భక్తుల సౌకర్యం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ తెలిపారు.యః శుచిః ప్రయతో భూత్వాజుహుయాదాజ్యమన్వహం శ్రియఃపంచ దశశ్చంచ శ్రీకామస్సతతం జపేత్ లక్ష్మీదేవి అనుగ్రహం పొందాలంటే శుభ్రత పాటిస్తూ, ఆ దేవి 15 మంత్రాలను నిత్యం పారాయణం చేయాలి. శుచిత్వం ఉన్న చోట లక్ష్మీదేవి ఉంటుందని ఈ మంత్రం ద్వారా తెలుస్తోంది. లక్ష్మి అంటే లౌకిక వ్యవహారాల్లో ఉపయోగించే ధనం మాత్రమే కాదు. ఆరోగ్యం కూడా ధనమే. పంచభూతాలకు ప్రతీక వరలక్ష్మీ వ్రతంలో భాగంగా కలశాన్ని స్థాపించి పూజించాలి..

# అధికార దాహంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాల ప్రచారం



**ముత్తారం, సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
బీఆర్ఎస్ నాయకుడు పుట్ట మధు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం ముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, ముత్తారం మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ అభ్యర్థి నూనేటి కృష్ణ మాట్లాడుతూ విపక్ష నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ఇటీవల బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవం, రైతు నిరసన కార్యక్రమంలో పుట్ట మధు చేసిన వ్యాఖ్యలు ఆయనకు ప్రాంతీయ సమస్యలపై ఉన్న అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. మండలంలో బీఆర్ఎస్ కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే కాంగ్రెస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని, కావాలంటే మరో పది కార్యాలయాలు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేయడం సరికాదని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెన నాసిరకం పనుల కారణంగానే కూలిపోయిందని, దీనిపై విచారణ కమిటీ కూడా దర్యాప్తు చేస్తోందని గుర్తు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దళితులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు..

# కోదండరామ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

-తెలిపిన టీజేఎస్ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు పిల్లి రవీందర్




**హైదరాబాద్, సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
సత్యం కోసం పోరాడే నాయకుడిగా, ప్రజా సమస్యలపై రాజీలేని గళంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సేవలందిస్తున్నారని టీజేఎస్ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షుడు పిల్లి రవీందర్ పేర్కొన్నారు. కోదండరామ్‌కు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను తన గురువుగా, మార్గదర్శిగా భావిస్తున్నానని రవీందర్ పేర్కొన్నారు.

# సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటు పడాలి

-మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సంచార జాతుల ప్రతినిధి బృందం వినతి




**హైదరాబాద్, సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాష్ట్ర సంచార జాతుల సంఘం ప్రతినిధి బృందం శుక్రవారం ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేణుక నారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ తిపిరిశెట్టి, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మోహన్ చౌహన్, పిల్లి సంజయ్ కిరణ్, పిల్లిరవీందర్ తదితరులు పాల్గొన్నారు. రాబోయే రాష్ట్ర విముక్తి జాతుల దినోత్సవం-2026 వేడుకల నిర్వహణతో పాటు సంచార జాతుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై ప్రతినిధులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ సంచార విముక్తి జాతుల దినోత్సవ వేడుకల నిర్వహణపై వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ రేణుక నారాయణ, సంచార జాతుల సంఘం నాయకులతో కలిసి బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎంబీసీ కార్పొరేషన్ సీఈఓతో చర్చించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించి తుది నిర్ణయాన్ని త్వరలో తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి సానుకూలంగా స్పందించడంపై సంచార జాతుల సంఘం నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# వెదురు దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

-తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్





**హైదరాబాద్,సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
సెప్టెంబర్ 18న నిర్వహించే ప్రపంచ వెదురు దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొర్రిగల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెదురు ఆధారిత వృత్తులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న మేదరి మహేంద్ర సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వెదురు వృత్తికి ప్రభుత్వ ప్రోత్సాహం, వృత్తిదారుల సంక్షేమం తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించే అంశంపై సంబంధిత అధికారులతో చర్చించి, త్వరలో తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం ప్రతినిధులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్ కుమార్ హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వెదురు దినోత్సవం అధికారికంగా నిర్వహించడం ద్వారా వెదురు వృత్తి, వెదురు ఉత్పత్తుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు, వృత్తిదారులకు ఉపాధి, ఆర్థికాభివృద్ధి అవకాశాలు మరింత మెరుగు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ట్రాన్స్ఫార్మరా కరుణించు

-సామాజిక కార్యకర్త వెంకట రెడ్డి వినూత్న నిరసన



**/మెట్ పల్లి సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
మల్లాపూర్ మండల కేంద్రం లో అప్రకటిత విద్యుత్ కో తలతో సతమతమవుతు న్నామని ప్రముఖ సామాజి క కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి వినూత్నంగా నిరసన చే పట్టారు.స్థానికంగా అందు బాటులో ఉండవలసిన వి ద్యుత్ అధికారులు మరి యు సిబ్బంది పట్టణ ప్రాం తాల్లో ఉండడంతో సమస్య లు తలెత్తుతున్నట్లు తెలు స్తోంది,రాత్రి, పగలు సమ యాల్లో కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుం దో దేవుడికే తెలుసు అని ఒ క విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఇక నైనా ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు .

vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com

## కూరగాయలు తినడం ఇష్టం లేదా?

# అయితే ఈ చిట్కాలు మీ కోసమే..

**-జ్యూస్, సలాడ్, కూర రూపంలో ఆహారంలో చేర్చుకోవాలని నిపుణుల సూచన**

**-రోజంతా విభజించి తీసుకుంటే అలవాటు సులభం**

**-పీచు, విటమిన్లు, ఖనిజాల కోసం కూరగాయలు తప్పనిసరి**

**-నచ్చిన రుచులతో తీసుకుంటే కూరగాయల వినియోగం పెరుగుతుంది**

హెల్త్ డెస్క్: కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిసినా, వాటిని నేరుగా తినడం ఇష్టం లేని వారు చాలామంది ఉంటారు. అలాంటి వారు కూరగాయలను పూర్తిగా దూరం చేయకుండా, తమకు నచ్చిన రూపాల్లో ఆహారంలో చేర్చుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కూరగాయలను బలవంతంగా తినడం కంటే రుచికరమైన ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ద్వారా వాటి వినియోగాన్ని పెంచుకోవచ్చని చెబుతున్నారు.



జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు

టమాటా, క్యారెట్, బీట్‌రూట్, పుదీనా, కొత్తిమీర వంటి కూరగాయలతో తయారుచేసిన జ్యూస్‌లు రుచికరంగానే కాకుండా పోషకాలతోనూ నిండివుంటాయి. రోజులో ఒకటి లేదా రెండు రకాల కూరగాయల జ్యూస్‌లు తీసుకోవడం ద్వారా కూరగాయలను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే జ్యూస్‌లు మాత్రమే తీసుకుంటూ తాజా కూరగాయలను పూర్తిగా మానేయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సలాడ్లు మంచి ప్రత్యామ్నాయం

కూరగాయలను వండుకుని తినడం ఇష్టం లేని వారికి సలాడ్లు మంచి ఎంపిక. ఆకుకూరల సలాడ్, బొప్పాయి సలాడ్, దానిమ్మ-కీరదోస సలాడ్ వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవచ్చు. సలాడ్ల ద్వారా కూరగాయల్లోని సహజ పీచు పదార్థాన్ని పూర్తిగా పొందే అవకాశం ఉంటుంది. అలాగే తాజాదనం, సహజ రుచి సలాడ్లను మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి.

వండిన కూరలతో పూర్తి పోషకాలు

రోజువారీ భోజనంలో సాధారణ కూరలు, భాజీలు కూడా తప్పనిసరిగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. జ్యూస్, సలాడ్, వండిన కూరలు ఇలా మూడు రూపాల్లో కూరగాయలను రోజంతా విభజించి తీసుకుంటే ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినాల్సిన అవసరం ఉండదు. దీంతో కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం సులభమవుతుంది.

చిన్న మార్పులతో పెద్ద ప్రయోజనాలు

ఉదయం కూరగాయల జ్యూస్, మధ్యాహ్నం లేదా సాయంత్రం సలాడ్, భోజన సమయంలో వండిన కూర తీసుకోవడం ద్వారా రోజువారీ కూరగాయల అవసరాన్ని తీర్చుకోవచ్చు. కూరగాయలను ఎక్కువగా తినాలనే లక్ష్యం మొదట్లో కష్టంగా అనిపించినా, వాటిని వివిధ రూపాల్లో తీసుకుంటే సులభంగా అలవాటు చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

మీకు నచ్చిన విధానమే ఉత్తమం

కూరగాయలు తినడం ఇష్టం లేని వారు తమకు నచ్చిన రుచులు, వంట విధానాలను గుర్తించి వాటికి అనుగుణంగా కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో తినడం కంటే రోజంతా చిన్న చిన్న మోతాదుల్లో వివిధ రూపాల్లో తీసుకోవడం ఆరోగ్యకరమైన, ఆచరణాత్మకమైన మార్గమని పేర్కొంటున్నారు.

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..

# అయితే మీలో సోడియం లోపం ఉందని అర్థం..

ఉప్పు.. మన రోజువారీ వంటల్లో తప్పనిసరిగా ఉపయోగించే పదార్థం. అయితే ఆరోగ్యంపై చర్చ వచ్చినప్పుడు ఉప్పును చాలామంది తప్పుగా చూస్తుంటారు. ముఖ్యంగా అధిక ఉప్పు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనే భయంతో కొందరు దాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. కానీ మన శరీరానికి సోడియం అనే ఖనిజం కూడా అవసరమే. శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటం, నరాల పనితీరుకు సహకరించడం, కండరాలు సరిగ్గా పనిచేయడం వంటి ముఖ్యమైన ప్రక్రియల్లో సోడియం కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి తగినంత సోడియం అందుతుంది. అయితే ఎక్కువగా చెమట పట్టడం, తీవ్రమైన వ్యాయామం చేయడం, వేడి వాతావరణంలో ఎక్కువసేపు ఉండటం లేదా శరీరం నుంచి ద్రవాలు ఎక్కువగా కోల్పోవడం వంటి పరిస్థితుల్లో ఎలక్ట్రోలైట్ స్థాయిల్లో మార్పులు వస్తాయి. అలాంటి సమయంలో కేవలం నీరు తాగడం మాత్రమే సరిపోదని, శరీరంలోని ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు.



**ఈ లక్షణాలు కనిపిస్తే..**

శరీరంలో సోడియం తక్కువగా ఉన్నప్పుడు కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలు కనిపించాయంటే తప్పనిసరిగా సోడియం లోపమేనని అర్థం కాదు. అయినప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయకుండా పరిస్థితిని గమనించడం అవసరం. ఎంత నీరు తాగినా దాహం తీరకపోవడం అలాంటి సంకేతాల్లో ఒకటిగా చెప్పవచ్చు. నీరు తాగిన వెంటనే మూత్రం రావడం, తరచూ దాహం వేయడం వంటి పరిస్థితులు ఉంటే శరీరంలో ద్రవాలు మాత్రమే కాకుండా ఎలక్ట్రోలైట్లు, సోడియం సమతుల్యతను కూడా పరిశీలించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి తగిన హైడ్రేషన్ అంటే కేవలం నీరు తీసుకోవడం మాత్రమే కాదని, నీరు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా అవసరమని చెబుతున్నారు.

**తీపి పదార్థాలపై కోరిక..**

అదేవిధంగా అదుపు చేయలేని తీపి పదార్థాల కోరిక కూడా కొన్ని సందర్భాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా ఎక్కువగా చెమట పట్టిన తర్వాత బిస్కెట్లు, స్వీట్లు వంటి వాటిని తినాలనే కోరిక పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి కోరికలకు సోడియం స్థాయిల్లో మార్పులు కూడా ఒక కారణం అవుతాయని చెబుతున్నారు. అందుకే తీపి పదార్థాలపై కోరిక పెరిగినప్పుడు దాన్ని కేవలం స్వీట్ టూత్ గా భావించే ముందు ఆహారంలో తగినంత సోడియం, ఇతర ఎలక్ట్రోలైట్లు అందుతున్నాయా అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. కండరాల్లో అకస్మాత్తుగా వచ్చే తిమ్మిర్లు కూడా మరో సంకేతంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా కాళ్ల కండరాలు పట్టేయడం, కాలివేళ్లు ముడుచుకుపోవడం, చేతి కండరాలు బిగుసుకుపోవడం లేదా పొట్ట కండరాలు గట్టిగా మారడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా మద్యం తీసుకున్న తర్వాత ఇలాంటి కండరాల తిమ్మిర్లు కనిపిస్తే కేవలం ఎక్కువ నీరు తాగడంపైనే దృష్టి పెట్టకుండా శరీరంలోని మొత్తం ద్రవాలు, ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**భయపడాల్సిన పనిలేదు..**

సోడియం విషయంలో పూర్తిగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. శరీరం స్వయంగా సోడియంను తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా దాన్ని పొందాల్సి ఉంటుంది. అయితే సోడియం ఎక్కువగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి దాన్ని పూర్తిగా దూరం పెట్టడం లేదా అవసరానికి మించి తీసుకోవడం కాకుండా వ్యక్తిగత అవసరాలను అర్థం చేసుకుని సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా ఎక్కువగా చెమట పట్టే పరిస్థితుల్లో లేదా శరీరం నుంచి ద్రవాలు కోల్పోయినప్పుడు కేవలం నీటిపైనే ఆధారపడకుండా ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే తరచూ తీవ్రమైన దాహం, కండరాల తిమ్మిర్లు లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే స్వయంగా ఉప్పు తీసుకోవడం పెంచకుండా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# భోజనం తర్వాత పైనాపిల్ తింటే జీర్ణక్రియకు మేలు

ప్రోటీన్ల జీర్ణక్రియలో కీలక పాత్ర పోషించే బ్రోమెలైన్ ఎంజైమ్

పీచు పదార్థం, విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లతో ఆరోగ్యానికి మద్దతు

అధిక ప్రోటీన్ ఆహారం తీసుకున్న వారికి ప్రయోజనం

పరిమిత మోతాదులో తీసుకుంటేనే మంచి ఫలితాలు

అలర్జీ ఉన్నవారు, సప్లిమెంట్లు వాడేవారు జాగ్రత్త అవసరం

హెల్త్ డెస్క్:
భోజనం తర్వాత పైనాపిల్ తినడం జీర్ణక్రియకు కొంతమేర సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పైనాపిల్‌లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ప్రోటీన్లను చిన్న భాగాలుగా విడగొట్టి శరీరం సులభంగా గ్రహించేలా చేస్తుంది. అందుకే మాంసం, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, పప్పుధాన్యాలు వంటి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకున్న తర్వాత పరిమిత మోతాదులో పైనాపిల్ తీసుకోవాలని సూచిస్తున్నారు. పైనాపిల్‌లోని బ్రోమెలైన్ పండు భాగంతో పాటు కాడలో కూడా ఉంటుంది. ఈ ఎంజైమ్ జీర్ణాశయంలో విడుదలయ్యే సహజ ఎంజైమ్‌లతో కలిసి పనిచేసి జీర్ణక్రియను మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. భోజనం తర్వాత కడుపు భారంగా అనిపించే వారికి కూడా ఇది కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

**పేగుల ఆరోగ్యానికి తోడ్పాటు**

పైనాపిల్‌లో పీచు పదార్థం సమృద్ధిగా ఉండటంతో పేగుల కదలికలు సక్రమంగా సాగేందుకు సహాయపడుతుంది. దీంతో జీర్ణక్రియ సులభతరం కావచ్చు. అలాగే ఇందులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తికి కూడా మేలు జరుగుతుంది.
భారతీయ వైద్య పరిశోధనా మండలి , నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వివరాల ప్రకారం 100 గ్రాముల పైనాపిల్‌లో సుమారు 48 కిలోకేలరీల శక్తి, 0.5 గ్రాముల ప్రోటీన్, 1.4 గ్రాముల పీచు పదార్థం, 147 మిల్లీగ్రాముల పొటాషియం, 39 మిల్లీగ్రాముల విటమిన్-సి లభిస్తాయి.

**ఎక్కువగా తింటే ఇబ్బందులు**

పైనాపిల్‌ను అధికంగా తీసుకోవడం వల్ల కొందరికి నోటిలో మంట, చికాకు లేదా అసౌకర్యం కలగవచ్చు. పైనాపిల్‌కు అలర్జీ ఉన్నవారు దీనిని తీసుకోకూడదు. అలాగే బ్రోమెలైన్ సప్లిమెంట్లను వైద్యుల సలహా లేకుండా వాడటం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఎంత మోతాదులో తీసుకోవాలి?**

భోజనం తర్వాత సుమారు ఒక కప్పు తాజా పైనాపిల్ ముక్కలు తీసుకోవడం సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే దీనిని ఆరోగ్యకరమైన, సమతుల ఆహారంలో భాగంగా మాత్రమే తీసుకోవాలని, ఏ జీర్ణ సమస్యకైనా ఇది ప్రత్యక్ష చికిత్స కాదని స్పష్టం చేస్తున్నారు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి దీని ప్రభావం మారవచ్చని నిపుణులు చెబుతున్నారు.



# మిరియాలు చేసే మేలు



లలవర్షాకాలం మొదలైతే చాలు జలుబు, దగ్గు, గొంతు నొప్పి లాంటి సమస్యలు చాలామందిని ఇబ్బంది పెడుతుంటాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తకువగా ఉన్నవారిలో ఈ సమస్యలు తీవ్రంగా ఉంటాయి. అయితే ఈ చికాకులను తగ్గించడానికి ఇంటి చిటాలు ఎఫెక్టివ్‌గా సహాయపడతాయి. అలాంటి వాటిలో వంటింట్లో తప్పనిసరిగా ఉండే మిరియాలు ఒకటి. మసాలా దినుసుగా మాత్రమే కాకుండా, ఆయుర్వేదంలోనూ మిరియాలకు ప్రత్యేక స్థానం ఉంది. వర్షాకాలంలో జలుబు, గొంతు నొప్పిని తగ్గించడంలో మిరియాలు చాలా ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి

**గొంతునొప్పికి విరుగుడు:** జలుబు వచ్చినప్పుడు గొంతులో మంట, నొప్పి, గరుకుదనం లాంటి సమస్యలు సాధారణం. గోరువెచ్చని నీటిలో చిటికెడు మిరియాల పొడి కలిపి తీసుకున్నా, తేనెతో కొద్దిగా మిరియాల పొడి కలిపి తీసుకున్నా గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్ , యాంటీ ఆక్సిడెంట్ గుణాలు గొంతు చికాకును దూరం చేస్తాయి. గొంతులోని కఫాన్ని పలుచన చేసి రిలీఫ్ ఇస్తాయి. ఈఎన్‌టీ డాక్టర్‌ను కలవండి

**జలుబు, దగ్గు మటుమాయం:** నల్ల మిరియాలలో పైపరిన్ ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్. అంతే కాకుండా.. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గొంతు నొప్పి, దగ్గు, ముకు దిబ్బడ సమస్యను పరిష్కరిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం గొంతులో పేరుకుపోయిన కఫాన్ని కరిగించే గుణం మిరియాలకు ఉంటుంది. దీంతో కఫం బయటికి రావడం సులభమై, ఛాతీలో బరువు కొంత తగ్గుతుంది. ఉపశమనం కోసం మిరియాల పొడిని తేనె లేదా అల్లం టీతో కలిపి తీసుకోండి.

**ఇమ్యూనిటీ కోసం:** మిరియాలలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఫ్లేవనాయిడ్స్ , కెరోటినాయిడ్స్ వంటి శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మిరియాలను తరచు తీసుకుంటే రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. ఇన్ఫెక్షన్లు, రోగాలు రాకుండా ఉంటాయి. మిరియాలలో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు, తేమతో కూడిన వర్షాకాలంలో వృద్ధి చెందే హానికరమైన బ్యాక్టీరియా, క్రిముల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.

వార్త సంధ్య

# గంట వర్షానికే ఢిల్లీ అతలాకుతలం

**విమానాశ్రయం లోపలికి నీరు**

**ఢిల్లీ-ఎన్‌సీఆర్‌పై ఐఎండీ రెడ్ వార్నింగ్**



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
శుక్రవారం మధ్యాహ్నం ఓ గంటసేపు కురిసిన భారీ వర్షానికి దేశ రాజధాని ఢిల్లీ అతలాకుతలమైంది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), పశ్చిమ ఢిల్లీలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. సాగర్‌పూర్‌లోని గాంధీ మార్కెట్ సహా అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. చాలా చోట్ల నివాస కాలనీల్లోని రోడ్లు నీట మునిగి, చెరువులను తలపిస్తున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో భారీ వర్షపాతంపై రెడ్ వార్నింగ్ జారీచేసింది. శనివారం భారీ వర్షాలు, ఉరుములతో కూడిన తుఫానులు ఉంటాయని తెలిపింది.

నీట మునిగిన విమానాశ్రయం

భారీ వర్షానికి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నీరు నిలిచిపోయి, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు విమానాశ్రయంలోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. కొంతమంది లగేజీ ట్రాలీలను నీటిలో నెట్టుకుంటూ ప్రవేశ ద్వారాల వైపు వెళ్లడం కనిపించింది.

## ఫోక్స్‌వ్యాగన్‌లో లక్ష ఉద్యోగాల కోత

**లేఆఫ్ ప్రణాళిక వెల్లడించిన సంస్థ**



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జర్మన్ ఆటోమొబైల్ దిగ్గజ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ లక్ష మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నది. ఈ దశాబ్దం చివరినాటికి లక్షమందిని ఇంటికి పంపించడానికి రంగం సిద్ధమయ్యింది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య గురువారం ఒప్పందం జరిగినట్టు ఆడీ, పోర్షే లాంటి 10 బ్రాండ్ల సమూహం కలిగి ఉన్న ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది.
సంస్థ నుంచి 50 వేల మందిని తొలగించడానికి ఇప్పటికే ఒప్పందం జరుగగా, తాజాగా మరో 50 వేల మంది లేఆఫ్‌నకు సంబంధించిన ఒక ప్రణాళిక ఆమోదం పొందినట్టు తెలిపింది. 'ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని తీర్చిదిద్దడం కోసం ఈ నిర్ణయం తప్పనిసరి' అని సంస్థ ప్రకటించింది. యూఎస్ టారిఫ్‌లు, ఎలక్ట్రిక్ కార్లకు అస్థిరమైన డిమాండ్, చైనా, ఇతర దేశాల నుంచి వస్తున్న పోటీ తదితర కారణాల వల్ల సంస్థ ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. లక్ష మంది తొలగింపు అంటే ప్రపంచంలోని కారు తయారీ సిబ్బందిలో 15 శాతమని వాహనరంగ నిపుణులు పేర్కొంటున్నారు. గతంలో 2009లో జనరల్ మోటర్స్ దివాలా తీసినప్పుడు 50 వేల మంది ఉద్యోగులను తొలగించింది.

## బీహార్‌కు వరద ముప్పు..


**13 జిల్లాలకు హై అలర్ట్**



**పాట్నా సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
బీహార్‌లో గంగతోపాటు ఎనిమిది నదుల నీటిమట్టం గణనీయంగా పెరుగడంతో 13 జిల్లాలకు వరద ముప్పు ఏర్పడింది. పాట్నా, బక్సర్, ముంగేర్, భాగల్పూర్ సహా పలు ప్రాంతాల్లో గంగా నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటింది. దీంతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను కమ్యూనిటీ హాళ్లు, తాత్కాలిక శిబిరాలకు తరలిస్తున్నారు. పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ, సహాయక చర్యలు చేపడుతున్నది.ప్రజలు నదులు, కాలువలకు దూరంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. పాట్నాలోని గాంధీ ఘాట్, హాతీధ్ ప్రాంతాల్లో గంగా నీటిమట్టం వేగంగా పెరుగుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే పలు రికార్డులు బద్దలయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పాట్నా రక్షణ గోడకు ఉన్న 108 గేట్లను జిల్లా యంత్రాంగం మూసివేసింది. బక్సర్ జిల్లాలో గంగా నీటిమట్టం ప్రతి గంటకూ రెండు సెంటీమీటర్లు పెరుగుతున్నది.

## పంది కిడ్నీతో 9 నెలల జీవనం!

**వైద్య చరిత్రలో రికార్డు**



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
చివరి దశ మూత్రపిండాల వైఫల్యంతో(కిడ్నీ ఫెయిల్యూర్) బాధపడుతున్న ఒక 66 ఏండ్ల వృద్ధుడికి మానవ మూత్రపిండాన్ని విజయవంతంగా అమర్చే వరకు జన్యుపరంగా మార్పు చేసిన పంది మూత్రపిండంతో రికార్డు స్థాయిలో తొమ్మిది నెలలపాటు డయాలసిస్ లేకుండా కాపాడినట్టు ది లాన్సెట్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం పేర్కొంది. బోస్టన్‌లోని మసాచుసెట్స్ ప్రభుత్వ దవాఖానలో దీన్ని నిర్వహించారు. మూత్రపిండాల చివరి దశ వ్యాధితో బాధపడుతున్న రోగులకు మూత్రపిండ మార్పిడీ ఉత్తమ మనుగడను, జీవన నాణ్యతను అందిస్తుంది.

# మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారం..

**-లాస్ట్ స్టాప్ కావడమే శాపం**

**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
మహారాష్ట్ర, నవీ ముంబైలో దారుణం జరిగింది. మూడేళ్ల చిన్నారిపై స్కూల్ వ్యాన్ డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అది కూడా స్కూల్ వ్యాన్‌లోనే లైంగిక దాడికి దిగాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలివి. నవీ ముంబైలో ఒక మూడేళ్ల చిన్నారి రోజూ స్కూల్ వ్యాన్‌లో పాఠశాలకు వెళ్లి వస్తుండేది. ఆ వ్యాన్‌లో స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వచ్చే చివరి చిన్నారి ఆ పాపే.వ్యాన్‌లోని మిగతా వాళ్లు ముందే దిగిపోయేవారు. ఆ మూడేళ్ల పాప అందరికంటే చివరి స్టాప్‌లో దిగాలి. దీంతో మిగతావాళ్లు దిగిన తర్వాత వ్యాన్‌లో ఒంటరిగానే ఉండేది. ఈ క్రమంలో వ్యాన్ డ్రైవర్ పాపపై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి ఇంటికి వచ్చిన



తర్వాత తీవ్ర కడుపు నొప్పితో బాధపడింది. ఈ కడుపు నొప్పి గురించి పాపను తల్లిదండ్రులు ఆరా తీయగా.. స్కూల్ వ్యాన్ డ్రైవర్ తనతో ఎలా ప్రవర్తించింది చెప్పింది. పాప అత్యాచారానికి గురైనట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసి షాక్ తిన్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. లాస్ట్ స్టాప్ వరకు వ్యాన్‌లో ఎవరూ లేకపోవడం, పాప ఒక్కర్తే ఉండటం వల్ల ఈ అత్యాచార ఘటన జరిగింది. డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అయితే, ఇలాంటి ఘటనలు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే పిల్లలు ప్రయాణించే స్కూల్ బస్సుల విషయంలో ప్రభుత్వం కొన్ని రూల్స్ రూపొందించింది. దీని ప్రకారం.. స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఒక మహిళా సిబ్బంది ఉండాలి. చివరి విద్యార్థి దిగేవరకు ఆ వ్యక్తి బస్సులోనే ఉంటూ, వారి రక్షణ బాధ్యతలు చూసుకోవాలి. అలాగే, స్కూల్ బస్సుల్లో సీసీటీవీ కెమెరాలు, ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణించే బస్సులను నిరంతరం మానిటరింగ్ చేయగలుగుతారు. అయితే, ఈ ప్రమాణాల్ని పాటించకపోవడం వల్ల విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.

## లోటు వర్షపాతంతో పంటలకు చేటు!

**-ఎల్ నినోతో క్షీణించిన రుతుపవనాలు**



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
బలపడుతున్న ఎల్ నినో ప్రభావంతో సెప్టెంబర్‌లో వర్షపాతం సగటు కంటే తక్కువగా, ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అంచనా వేసింది. గత మూడు దశాబ్దాలలోనే ఇది అత్యంత బలహీనమైన రుతుపవన కాలంగా మారవచ్చు. రుతుపవన వర్షాలు బలహీనంగా ప్రారంభం కావడం, నేలలో తగినంత తేమ లేకపోవడం వల్ల పత్తి, సోయాబీన్, మక్క, వరి వంటి ఖరీఫ్ పంటల సాగు ప్రక్రియలో జాప్యం జరిగింది. ఆగస్టులో సగటు కంటే తక్కువ వర్షపాతం కారణంగా ఈ పంటలు ఇప్పటికే తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కాయలు ఏర్పడటం, గింజలు నిండటం వంటి కీలక దశలోకి ప్రవేశిస్తున్నాయి. సెప్టెంబర్ వరకు సగటు కంటే తక్కువ వర్షపాతం కొనసాగితే దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

శీతాకాలపు పంటల పరిస్థితి

సాధారణంగా సెప్టెంబర్ 17 ప్రాంతంలో భారతదేశ వాయవ్య ప్రాంతం నుంచి రుతుపవనాలు వెనక్కి తగ్గడం మొదలై అక్టోబర్ మధ్య నాటికి పూర్తిగా ఉపసంహరించుకుంటాయి. అదే సమయంలో రైతులు గోధుములు, ఆవాలు, మక్క, శనగలు వంటి శీతాకాలపు పంటల సాగును ప్రారంభిస్తారు. సెప్టెంబర్ నెల వర్షపాతం నేలలోని తేమను నిర్ధారిస్తుంది. తేమ తక్కువగా ఉండటం విత్తనాల మొలకకు, పంట ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో నేలలో తేమ సాధారణం కంటే తక్కువగా ఉంటే రైతులు దిగుబడి నష్టాలను, తక్కువ ఆదాయాలను చవిచూడవచ్చు.


## ఒరాకిల్‌లో సైలెంట్ లేఆఫ్‌లు!

**స్లాక్ ఖాతాల మాయంపై ఉద్యోగుల్లో ఆందోళన**
**ప్రపంచవ్యాప్తంగా 7,000-10,000 ఉద్యోగాల కోత**





**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
: అమెరికన్ టెక్ దిగ్గజం ఒరాకిల్‌లో ఉద్యోగాల కోత నిశ్శబ్దంగా ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఒరాకిల్ ఉద్యోగులు సెప్టెంబర్ 1న వచ్చే మెయిల్ కోసం వారాల తరబడి సిద్ధమయ్యారు. కానీ వారు ఊహించినట్టు మాత్రం జరగలేదు. గత మార్చి 31న స్థానిక కాలమానం ప్రకారం సుమారు 6 గంటలకు అమెరికా, భారత్, కెనడా వ్యాప్తంగా 10,000 మందికి పైగా ఉద్యోగులకు తొలగింపు మెయిల్స్‌ను ఒరాకిల్ పంపింది.అయితే ఈసారి ఒరాకిల్ సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియను నిశ్శబ్దంగా చేపట్టాలని నిర్ణయించుకుంది. రెడిట్ పోస్ట్‌ల ప్రకారం సెప్టెంబర్ నాటి తొలగింపులు ఇప్పటికే మొదలయ్యాయి. మార్చిలో జరిగినట్టుగా ఉదయం 6 గంటలకు ఆకస్మిక తొలగింపుల ప్రక్రియ మొదలుకాలేదు. కానీ సిబ్బంది స్లాక్ ఖాతాలు మాత్రం మాయమవుతున్నాయని తెలుస్తున్నది. కంపెనీ అంతర్గత కమ్యూనికేషన్ యాప్ 'స్లాక్'లో లేఆఫ్‌లకు గురైన వారి ఖాతాలు క్రమక్రమంగా కనిపించకుండా పోతున్నాయనే ప్రచారం జరుగుతున్నది. తాజా ఉద్యోగాల కోతలో ప్రపంచవ్యాప్తంగా 7,000 నుంచి 10,000 ఉద్యోగాలు ప్రభావితం కావచ్చని అంతర్గత వర్గాల అంచనా.

## 9 రోజుల తర్వాత.. నేపాల్ టన్నెల్‌లో ఇద్దర్ని రక్షించిన ఆర్మీ



**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
నేపాల్‌లో సంభవించిన జల ప్రళయం తో త్రిశూలీ పవర్ ప్రాజెక్టు టన్నెల్ మూసుకుపోయిన విషయం తెలిసిందే. అయితే వరదలు వచ్చిన 9 రోజుల తర్వాత ఇవాళ రెస్క్యూ సిబ్బంది ఇద్దర్ని సజీవంగా కాపాడారు. త్రిశూలీ 3ఏ ప్రాజెక్టు టన్నెల్ నుంచి ఇద్దర్ని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఆ ఇద్దర్నీ ఫోర్‌మెన్ సంజయ్ సాహ(30), సూపర్‌వైజర్ కబీర్ మహార్జన్(45)గా గుర్తించారు. సంజయ్ సాహ మట్లాడుతూ.. జల విలయం సంభవించిన సమయంలో టన్నెల్‌లోని కార్మికులను సురక్షిత ప్రదేశానికి తరలిస్తున్న సమయంలో తాను ట్రాప్ అయినట్లు పేర్కొన్నాడు. కనీసం నలుగురితో ఆ టన్నెల్‌లో టచ్‌లో ఉన్నట్లు అతను చెప్పాడు. నేపాల్ వరదల వల్ల సుమారు 12 హైడ్రోపవర్ ప్రాజెక్టులు ధ్వంసం అయ్యాయి. వీటిల్లో సుమారు 900 మంది కార్మికులు చిక్కుకున్నారు. దీంట్లో ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు కూడా ఉన్నారు. నేపాల్ ఆర్మీ నేతృత్వంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక ఎక్విప్మెంట్ సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. టన్నెల్‌లో చిక్కుకున్న కొందరితో రెస్క్యూ సిబ్బంది మాట్లాడినట్లు తెలుస్తోంది.

## సోనియా గాంధీ ఆత్మకథను ప్రచురించనున్న హార్పర్ కొల్లిన్స్




**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
కాంగ్రెస్ పార్టీ నేత సోనియా గాంధీ తన ఆత్మకథను పుస్తక రూపంలో తీసుకువస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ బుక్‌ను హార్పర్‌కొల్లిన్స్ అనే సంస్థ ప్రచురించనున్నది. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా జీవితకథను తాము ప్రచురించనున్నట్లు హార్పర్‌కొల్లిన్స్ తన ఎక్స్ అకౌంట్ ద్వారా ప్రకటించింది. బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ బై సోనియా గాంధీ బుక్‌లో సోనియా తన స్వీయ అనుభవాలను రాశారు. ఈ ఏడాది నవంబర్ 10వ తేదీన ఆ బుక్‌ను పబ్లిష్ చేయనున్నారు. సోనియా గాంధీ ఆత్మకథ ఈనాటి తరం ఎదురుచూస్తున్న రాజకీయ జీవితకథ అని పబ్లిషర్స్ తెలిపారు. ప్రేమ, ఐడెంటిటీ, తన విధులకు చెందిన వ్యక్తిగత, నాటకీయత కూడిన పుస్తకమని హార్పర్‌కొల్లిన్స్ పేర్కొన్నదిఈ బుక్ ప్రచురణపై వివాదం నెలకొన్నది. బిలాంగింగ్ బుక్‌ను ప్రచురించేందుకు పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా తప్పుకున్నది. సోనియా జీవితకథకు చెందిన బుక్‌లో కొన్ని ఎడిటోరియల్ సవాళ్లు ఎదురయ్యాయని, దాని వల్ల ఆ బుక్‌ను పబ్లిష్ చేయలేకపోతున్నట్లు పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ పేర్కొన్నది.

## పోల్‌ను ఢీకొట్టిన ఇండిగో విమానం


**ఎయిర్‌పోర్టులో పార్కింగ్ చేస్తుండగా ఘటన**




**న్యూఢిల్లీ: సెప్టెంబర్ 04 (వార్త సంధ్య**
: ఓ ఇండిగో విమానం అనుకోకుండా మెటల్ పోల్‌ను ఢీకొట్టింది. నవీ ముంబై నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 9గంటలకు శ్రీనగర్ ఎయిర్‌పోర్టులో ఇండిగో 6ఈ 225 అనే ఫ్లైట్ ల్యాండ్ అయింది. పార్కింగ్ చేస్తుండగా అనుకోకుండా పోల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఫ్లైట్ ముందు భాగం దెబ్బతిన్నది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమా దం సంభవించలేదు. ఘటనపై విచారణ జరుపుతామని, విమానంలో ఏమైనా టెక్నికల్ సమస్యలున్నాయో తెలుసుకుంటామని ఇండిగో సంస్థ తెలిపింది.

వార్త సంధ్య

# తొలిసారి 'హారర్ కామెడీ' బాటలో మాస్ మహారాజా



బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట మొదలైతే ఎలా ఉంటుందో మాస్ మహారాజా రవితేజ మరోసారి నిరూపించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘనవిజయం సాధించి థియేటర్లలో కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ఈ చిత్రం తాజాగా రూ. 200 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్ సైతం అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. సినిమా ఆరంభంలో బేబీ నక్షత్ర, రవితేజ, ప్రియా భవానీ శంకర్‌లపై చిత్రీకరించిన అన్‌సీన్ స్టిల్‌ను చిత్ర దర్శకుడు శివ నిర్వాణ పంచుకుంటూ సక్సెస్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ, తన భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో వేగాన్ని పెంచడమే కాకుండా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎప్పుడూ రొటీన్ మాస్, కమర్షియల్ ఫార్ములాకే పరిమితం కాకుండా, కెరీర్‌లోనే మునుపెన్నడూ చేయని వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ సరికొత్త ప్రయాణంలో భాగంగా టాలీవుడ్‌లో వైవిధ్యమైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయతో రవితేజ చేతులు కలిపారు. 'సరిపోదా శనివారం' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వివేక్ ఆత్రేయ సిద్ధం చేసిన కథ రవితేజను అమితంగా ఆకట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రవితేజ తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నడూ టచ్ చేయని 'హారర్ కామెడీ' జోనర్‌లోకి తొలిసారిగా అడుగుపెడుతుండటం సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాధారణంగా మాస్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా, క్రైమ్ థ్రిల్లర్లతో పాటు పక్కా ఎంటర్‌టైనర్లలో రవితేజ తన మార్క్ చూపించారు. అయితే ప్రేక్షకులను భయపెడుతూనే కడుపుబ్బా నవ్వించే హారర్ కామెడీ తరహా పాత్రను ఆయన ఇంతవరకు చేయలేదు. వివేక్ ఆత్రేయ మార్క్ విలక్షణమైన స్క్రీన్‌ప్లే, రవితేజ అసమానమైన ఎనర్జీ, టైమింగ్ తోడైతే వెండితెరపై నవ్వుల విందు గ్యారెంటీ అని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. లక్ష్మణ్, శ్రీని సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉంది. వివేక్ ఆత్రేయ చిత్రంతో పాటే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను కూడా రవితేజ ఖరారు చేశారు. 'రాజ రాజ చోర', 'స్వాగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో ఓ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజు (శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్) నిర్మిస్తున్న ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు మరో ప్రధాన పాత్రలో సందడి చేయనున్నారు. రవితేజ మార్క్ జోష్‌కు శ్రీవిష్ణు పంచ్‌లు జతకలిస్తే వినోదం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ మల్టీస్టారర్ చిత్రాన్ని 2027 సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. మొత్తానికి హసిత్ గోలి సినిమా పూర్తి కాగానే వివేక్ ఆత్రేయ హారర్ కామెడీ సెట్స్‌పైకి వెళ్లనుంది.

## సంక్రాంతి రేసులో 'కాకా'.. హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్!



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




చీరకట్టులో బాపు బొమ్మలా..



# గాయం కూడా మంచికే!

'ఒక్కోసారి చెడు కూడా మంచే చేస్తుంది. 'మైసా' షూట్‌లో తగిలిన గాయం ఓ విధంగా నాకు మంచే చేసింది' అంటూ ఆనందం వెలిబుచ్చారు అగ్ర కథానాయిక రష్మిక మందన్నా. తాజాగా తన గాయం గురించి రష్మిక మాట్లాడుతూ 'పెళ్లయితే అయ్యిందికానీ.. సినిమా కమిట్‌మెంట్ల కారణంగా కలిసి ఉండే సమయం మాత్రం మాకు కరువైంది. పెళ్లి జరిగాక మూడునెలల పాటు మేమిద్దరం ఒకరినొకరం చూసుకోలేదంటే నమ్ముతారా!? కేవలం ఫోన్లలోనే మాట్లాడుకునేవాళ్లం. మా అవస్థ చూసి విధికి కూడా బాధ కలిగినట్టుంది. దాంతో నాకు విశ్రాంతి ఇద్దామని ఫిక్స్ అయ్యింది. అందుకే ఈ గాయమైంది కావొచ్చు. వినడానికి వింతగా అనిపించినా.. ఈ సమయం మాత్రం నాకు చాలా నచ్చింది. ఈ నెలరోజులూ ఇద్దరం ఇంట్లోనే హాయిగా గడిపాం. 'ఎలాంటి గాయాలూ లేకుండా మనం ఇలా ఎన్నో రోజులు గడపాలి' అని విజయ్ అనేవాడు. తను ఆటపట్టిస్తుంటే నాకెంతో ఆనందంగా ఉండేది. ఈ విశ్రాంతి రోజులన్నీ నాకు అద్భుతమైన జ్ఞాపకాలుగా నిలిచిపోయాయి. నాకు కొరియన్ డ్రామాలంటే పిచ్చి. విజయ్‌కేమో సీరియస్ డ్రామాలు, షోలు ఇష్టం. ఈ ఖాళీ టైమ్‌లో ఇద్దరం కలిసి రెండూ కవర్ చేశాం' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు రష్మిక. ఇదిలావుంటే.. గాయం నుంచి కోలుకున్న రష్మిక తిరిగి మళ్లీ షూటింగ్స్‌తో బిజీ కానున్నారు. ఇప్పటికే ముగింపు దశలో ఉన్న 'మైసా' చిత్రాన్ని ఆమె పూర్తి చేయనున్నారు. నవంబర్ 27న పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానున్నది. ఇక తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ఆమె నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న విషయం తెలిసిందే

# కమల్‌హాసన్ కొత్త సినిమా



గత ఏడాది విడుదలైన 'థగ్ లైఫ్' తర్వాత అగ్ర నటుడు కమల్‌హాసన్ కొత్త సినిమా పట్టాలెక్కలేదు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా ప్రకట జరిగింది. దాంతో పాటు స్టంట్ మాస్టర్ అన్బరివ్ దర్శకత్వంలో కూడా కమల్‌హాసన్ ఓ సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు ఈ రెండు చిత్రాలు ప్రకటనల వరకే పరిమితమై పోయాయి. ఈ నేపథ్యంలో అభిమానుల్ని సర్‌ప్రైజ్ చేస్తూ ఎస్.యు.అరుణ్‌కుమార్ దర్శకత్వంలో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు కమల్‌హాసన్. గురువారం కమల్‌హాసన్ లుక్ టెస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో చేతిలో ఆయుధాన్ని ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. యాక్షన్ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని ఫస్ట్‌లుక్‌ని చూస్తే అర్థమవుతున్నది. 'సేతుపతి' 'చిత్తా' చిత్రాలతో తమిళంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు దర్శకుడు ఎస్.యు.అరుణ్‌కుమార్. తాజాగా ఆయన కమల్‌హాసన్‌ను డైరెక్ట్ చేయడం తమిళ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని మేకర్స్ తెలిపారు. రాజ్‌కమల్‌ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.